



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 147 విశాఖపట్నం, 17 మార్చి 2026 మంగళవారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00

## పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని తెలుగుజాతి గుర్తుంచుకోవాలి: చంద్రబాబు



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 16 :** అమరజీవి పొట్టి శ్రీరాములు 58 రోజుల పాటు కఠోర దీక్ష చేశారని.. ఆత్మార్పణతో రాష్ట్రాన్ని సాధించి పెట్టారని ఏపీ సీఎం చంద్రబాబు (జష్ట్రుఅనతీుఝఎబ) అన్నారు. రాజధాని అమరావతి పరిధిలోని శాఖమూరు వద్ద 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

"పొట్టి శ్రీరాములు ఎన్నో సామాజిక ఉద్యమాల్లో భాగస్వాములయ్యారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో ఆయన పనిచేశారు. పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల భారీ విగ్రహాన్ని నిర్మించాం. దీని నిర్మాణానికి 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ స్ట్రక్చర్ వినియోగించారు. రాజధానిలో అమరజీవి విగ్రహం నిర్మాణం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని తెలుగుజాతి గుర్తుపెట్టుకోవాలి" అని చంద్రబాబు అన్నారు. గత పాలకులు 3 రాజధానుల పేరిట అసలు రాజధానే లేకుండా చేశారని చంద్రబాబు విమర్శించారు. "రాజధాని ప్రాంతాన్ని శ్మశానం, ఎడారి అంటూ ఎన్నో రకాలుగా అసత్యాలు ప్రచారం చేశారు. రాజధాని నిర్మాణంలో రైతులను భాగస్వాములను చేయాలని ఆలోచించా. రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి 33 వేల ఎకరాలు ఇచ్చారు. గత ప్రభుత్వ పాలనలో విధ్వంసం జరిగింది.. బ్రాండ్ నష్టపోయింది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే కూటమి ఏర్పాటు చేశాం. సమస్యలు వచ్చినప్పుడు బాధపడితే నష్టపోతాం.. సరైన నిర్ణయం తీసుకుని ముందుకెళ్తే అనుకున్నది సాధిస్తాం. కష్టకాలంలో సమష్టిగా పనిచేయగలిగితేనే మెరుగైన ఫలితాలు వస్తాయి. గోదావరి పుష్కరాలకు ముందే పోలవరాన్ని జాతికి అంకితం చేస్తాం "అని చంద్రబాబు అన్నారు.

**భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం తొలి అడుగు వేసిన వ్యక్తి: పవన్ కల్యాణ్**

పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహం ఏర్పాటైందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన త్యాగానికి గుర్తుగా జల్‌జీవన్ మిషన్ పనులకు 'అమరజీవి జలధార' పేరు పెట్టినట్లు గుర్తు చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు కోసం తొలి అడుగు వేసిన గొప్ప వ్యక్తి అని

మిగతా 2లో

## సిలిండర్ల దుర్వినియోగం కాకుండా చూడాలి: చంద్రబాబు



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 16 :** ఎల్పీజీ నిల్వలు, బుకింగ్, సరఫరాపై ఏపీ సీఎం చంద్రబాబు (జష్ట్రుఅనతీుఝఎబ) సమీక్ష నిర్వహించారు. సమావేశానికి వివిధ గ్యాస్ సరఫరా కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రస్తుతం 17,209 టన్నుల ఎల్పీజీ స్టాక్ అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. 1154 ఏజెన్సీల నుంచి గ్యాస్ సరఫరా అవుతోందని వెల్లడించారు. సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా తీసుకుంటున్న చర్యలపై సీఎం ఆరా తీశారు. డెలివరీ సమయంలో దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. అన్న క్యాంటీన్ల కిచెన్లకు గ్యాస్ సరఫరాపై ఆరా తీశారు.

సరఫరాపై ప్రజల్లో గందరగోళం తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చంద్రబాబు తెలిపారు. సిలిండర్ డెలివరీ సమయాన్ని సాధారణ పరిస్థితికి తీసుకురావాలని ఆదేశించారు. ఎల్పీజీ సరఫరా, నిల్వలు, బుకింగ్‌ను నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఆస్పత్రులు, బడులు, ఆలయాలకు ఇబ్బంది రాకుండా చూడాలని చెప్పారు. ఎల్పీజీ వినియోగం

⏭ తరువాయి 2లో..

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు
# 5,500కు పైగా విమానాలు రద్దు

**న్యూఢిల్లీ :** ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్‌ల మధ్య దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అగ్రరాజ్య స్థావరాలపై దాడుల పేరిట ఈ ప్రాంతంలోని దేశాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను ప్రయోగిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత్ నుంచి ఇప్పటివరకు 5,500కు పైగా విమానాలు రద్దయినట్లు పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు రాజ్యసభలో వెల్లడించారు. ఇందులో భారత విమానయాన సంస్థలకు చెందిన 4,335, విదేశీ సంస్థలకు చెందిన 1,187 విమానాలు ఉన్నాయని తెలిపారు. "పశ్చిమాసియాలో గగనతలం మూసివేతల కారణంగా ఈమేరకు విమాన సర్వీసులు రద్దయ్యాయి.

⏭ తరువాయి 2లో..



## ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీ
## రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు



**హైదరాబాద్, విశాఖ సమాచారమ్, మార్చి 16 :** రంగారెడ్డి జిల్లా మొయినా బాద్‌లో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్ డ్రగ్స్ పార్టీ రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్విమ్మింగ్‌పూల్ దగ్గర డ్రగ్స్‌తో పాటు మందు పార్టీ జరిగింది. ఫామ్‌హౌస్‌లోకి వెళ్లగానే మొదట బుల్లెట్ సౌండ్ వినపడింది. బుల్లెట్ సౌండ్ విని వెంటనే అప్రమత్త మయ్యాం. మేం పోలీసులం కాల్చవద్దు.. ఎలాంటి చర్యలు తీసుకోమని గట్టిగా అరిచాం. మేము చెప్తున్నప్పటికీ కూడా.. పట్టించుకోలేదు. మరో రెండుసార్లు బుల్లెట్ సౌండ్ వినపడింది. మరోవైపు మీరు కాల్పులు జరపండి.. నేను మొత్తం చూసుకుంటా.. ఏం జరిగినా నాదే బాధ్యత అంటూ గట్టిగా వినపడింది. మేమంతా గట్టిగా అరిచేసరికి ఫైరింగ్ సౌండ్ నిలిచిపోయింది. మేమంతా ఒక్కసారిగా స్విమ్మింగ్ పూల్ వద్దకు చేరుకున్నాం. ఫామ్‌హౌస్ సెర్చ్ చేసేందుకు మేము వారెంట్ తీసుకున్నాం. ఫామ్‌హౌస్‌లోకి వెళ్లిన వెంటనే.. సెర్చ్ వారెంట్లను రోహిత్‌రెడ్డికి ఇచ్చాం. బాత్రూం దగ్గర ఉన్న నమిత్ శర్మ చేతిలో.. తుపాకీని మేం స్వాధీనం చేసుకున్నాం.

బుల్లెట్ షెల్స్ పట్టుకొని మరొకరున్నారు. అతనిని కూడా అదుపులోకి తీసుకున్నాం. ఫామ్‌హౌస్‌లో ఓ మహిళతో పాటు 10మందిని అదుపులోకి తీసుకున్నాం. జర్మన్ మేడ్ రివాల్వర్ పాయింట్ 32ని స్వాధీనం చేసుకున్నాం. 11 మందిని విడివిడిగా విచారించాం. ఎవరు కూడా డ్రగ్స్ తీసుకోలేదని బుకాయించే ప్రయత్నం చేశారు. అందరినీ పదేపదే విచారించడంతో చివరికి శరత్‌కుమార్ డ్రగ్స్ తీసుకున్నట్లు ఒప్పుకున్నాడు. అతనిని చెక్ చేసినప్పుడు 2 గ్రాముల కొకైన్ బయట పడింది. కొకైన్ ఎవరు తెచ్చారనే విషయాన్ని ముందుగా అడిగితే చెప్పలేదు. పైలెట్ రోహిత్‌రెడ్డి డ్రైవర్‌ను విచారించినప్పుడు కొకైన్ ఎవరు తెచ్చారనే విషయం బయటపడింది. కొకైన్

⏭ తరువాయి 2లో..



## తిరుపతిలో ఉద్రిక్తత
## బీఆర్ నాయుడు రాజీనామాకు డిమాండ్

**తిరుపతి, విశాఖ సమాచారమ్, మార్చి 16 :** తిరుపతిలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు.. తిరుపతిలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్ ఉన్నారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నేతలు నిరసనలకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు అత్యుత్సాహంతో వైఎస్సార్‌సీపీ నేతలను అరెస్ట్ చేశారు.

వివరాల ప్రకారం.. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఉన్న గ్రాండ్ రిడ్జ్ హోటల్ ఎదుట వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఉదయం నిరసనలకు దిగారు. బీఆర్ నాయుడు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాలు గీత యాదవ్, సాయి కుమారి, పద్మజ, విజయ లక్ష్మిలను తిరుచానూరు పోలీసులు అరెస్ట్ చేశారు.

అంతకుముందు హోటల్ ఎదుట నిరసనల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను టీడీపీ నేత జేబీ అనుచరులు అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారు.

## అసెంబ్లీలో చిరునవ్వులు
## రాజాసింగ్‌ను ఆటపట్టించిన కేటీఆర్



**హైదరాబాద్, విశాఖ సమాచారమ్, మార్చి 16 :** తెలంగాణ అసెంబ్లీలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే రాజాసింగ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆటపట్టించారు. వారిద్దరి మధ్య సరదా సంభాషణ కొనసాగింది. అనంతరం, మీడియ ఏదో అనుకుంటుంది అంటూ.. ఇరువురు నేతలు నవ్వుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉభయ సభలను ఉద్దేశించి నేడు గవర్నర్ ప్రసంగం కొనసాగింది. అనంతరం, అసెంబ్లీ లాబీలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్.. బీజేఎల్పీ చాంబర్ నుంచి బయటకు వచ్చారు. అదే సమయంలో మాజీ మంత్రి కేటీఆర్ అటుగా వెళుతుండగా.. రాజాసింగ్‌ను గమనించారు. దీంతో, బీజేపీ నుంచి సస్పెండ్ అయిన వ్యక్తి బీజేఎల్పీలోకి ఎలా వెళ్లారు అంటూ నువ్వుతూ సెటైర్ వేశారు.

బీజేఎల్పీ నుంచి బయటికి రా అంటూ రాజాసింగ్‌ను సరదాగా కేటీఆర్ ఆటపట్టించారు. ఇంతలో అక్కడే ఉన్న మరో బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కల్పించుకుని.. సరదాగా మీరు కూడా బీజేఎల్పీ చాంబర్‌లోకి రండి అంటూ కేటీఆర్‌ను ఆహ్వానించారు. వెంటనే కేటీఆర్ స్పందిస్తూ.. తాను బీజేఎల్పీ చాంబర్‌లోకి వస్తే మీడియా వాళ్ళు ఇంకేదో రాస్తారు అంటూ నవ్వుకుంటూ వెళ్లిపోయారు. దీంతో, ఇరు పార్టీల నేతల మధ్య సరదా సంభాషణ కొనసాగింది.

అనంతరం, బీజేఎల్పీలోకి వెళ్ళడంపై ఎమ్మెల్యే రాజసింగ్ స్పందిస్తూ..'పాత ఇల్లు.. పాత ఫ్రెండ్స్ ఎప్పుడైనా పోతాను.. ఎప్పుడైనా వస్తాను. పార్టీలో మళ్లీ చేరడంపై ఇంకా డిసైడ్ కాలేదు. ఎవరు ఎవరిని బతిమాలుతున్నారో భవిష్యత్తులో తెలుస్తుంది' అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

మరోవైపు.. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఫిరాయింపు ఎమ్మెల్యేలు అధికార పార్టీ పక్షంవైపు కూర్చోవడం గమనార్హం. ఈ క్రమంలో ఫిరాయింపు

⏭ తరువాయి 2లో..

## ఎల్‌పీజీ సంక్షోభంపై కేంద్రం అబద్దాలు చెబుతోంది : మల్లిఖార్జున ఖర్గే



**న్యూఢిల్లీ:** ఇరాన్ వార్‌తో దేశంలో ఎల్‌పీజీ గ్యాస్ లభ్యంత గందరగోళంగా మారింది. సోమవారం పార్లమెంటులో ఈ సంక్షోభంపై దుమారం రేగింది. ఒకవైపు ఎల్‌పీజీ కొరతలేదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి ఆందోళనగా కరంగా ఉందని కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే విమర్శలు గుప్పించారు. దీంతో ప్రతిపక్ష నాయకుడు (ఎల్ఓపి) మల్లికార్జున్ ఖర్గే, జె.పి. నడ్డా మధ్య వాగ్వాదంచోటు చేసుకుంది. జీరో అవర్ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, గల్ఫ్ యుద్ధం మరియు హార్ముజ్ జలసంధి దిగ్బంధనం వల్ల ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఎల్‌పిజి సరఫరాపై ఆందోళనలు చెలరేగుతున్న నేపథ్యంలో, కాంగ్రెస్ కేంద్రంపై మండిపడింది. రాజ్యసభలో ఎల్‌పిజి సంక్షోభ అంశాన్ని లేవనెత్తిన మల్లికార్జున్ ఖర్గే సిలిండర్ల ప్యానిక్ బుకింగ్‌పై ఖర్గే విమర్శలు గుప్పించారు. ఎల్‌పిజి సమస్య మధ్యతరగతి, రెస్టారెంట్లు,

⏭ తరువాయి 2లో..

## కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల కేటాయింపు షురూ

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు, కేటరింగ్ విభాగాలకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీ ప్రక్రియను వివిధ రాష్ట్రాలు ప్రారంభించాయి. ఢిల్లీ సహా దాదాపు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ కేటాయింపులు అమల్లోకి వచ్చాయి.

**ప్రాధాన్యత క్రమంలో పంపిణీ**

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) రోజువారీ సగటు వినియోగంలో 20 శాతం మేర నియంత్రిత పంపిణీ కోసం కేటాయించాయి. ఢిల్లీ వంటి మెట్రో నగరాల్లో రోజుకు సుమారు 1,800 సిలిండర్లను ఈ విధానం కింద పంపిణీ చేయనున్నారు. ముఖ్యంగా ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని పంపిణీలో ఐదు స్థాయిల ప్రాధాన్యతను నిర్ణయించారు:

**స్థాయి 1, 2:** విద్యాసంస్థలు, ఆసుపత్రులు, రైల్వేలు, విమానాశ్రయాలకు అత్యున్నత ప్రాధాన్యత.



స్థాయి 3: రెస్టారెంట్లు, భోజనశాలలకు 42 శాతం వాటా.
స్థాయి 4: హోటళ్లు, గెస్ట్ హౌస్‌లు, ట్రస్టులకు 4 శాతం కేటాయింపు.
స్థాయి 5: డెయిరీలు, బేకరీలు, స్వీట్ షాపులకు 11 శాతం కేటాయింపు.

రాష్ట్రాల వారీగా.. కేంద్ర మార్గదర్శకాలను అనుసరించి ఇప్పటికే ఢిల్లీ, బిహార్, హరియాణా,

⏭ తరువాయి 2లో..

# పొట్టి శ్రీరాములుకి వైఎస్ జగన్ నివాళి



**తాడేపల్లి, విశాఖ సమాచారమ్, మార్చి 16 :** ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన మహనీయుడు.. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి (మార్చి16) నేడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నివాళులర్పించారు.

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక మహనీయుడు శ్రీ పొట్టిశ్రీరాములుగారు. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం సాధించాలనే మహోన్నత లక్ష్యంతో ప్రాణత్యాగం చేసి చరిత్రలో అమరుడిగా నిలిచారు. ఆయన త్యాగం తరతరాలకు స్ఫూర్తి. నేడు శ్రీ పొట్టిశ్రీరాములు గారి జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్నాను.' అంటూ వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక మహనీయుడు శ్రీ పొట్టిశ్రీరాములుగారు. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం సాధించాలనే మహోన్నత లక్ష్యంతో ప్రాణత్యాగం చేసి చరిత్రలో అమరుడిగా నిలిచారు. ఆయన త్యాగం తరతరాలకు స్ఫూర్తి. నేడు శ్రీ పొట్టిశ్రీరాములు గారి జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్నాను.


# ఇటు ఎండ.. అటు వాన!

### రానున్న మూడ్రోజులూ రాష్ట్రంలోభిన్న వాతావరణం



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 16 :** రాష్ట్రంలో రానున్న మూడు రోజులూ ఓ వైపు ఎండులు, మరోవైపు ఆకాశం మేఘావృతమై విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ద్రోణి, నైరుతి దిశ నుంచి వీచే గాలుల ప్రభావంతో సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆకస్మిక వర్షాల సమయంలో పడే పిడుగుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# అట్టుడుకుతున్న దుబాయ్ : విమానాశ్రయం వద్ద డ్రోన్ దాడి



మధ్యప్రాచ్య వివాదం ప్రారంభమైనప్పటి నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌పై 1,800కి పైగా క్షిపణులు, డ్రోన్‌లను ఇరాన్ ప్రయోగించింది. ఇరానియన్ డ్రోన్ దాడి తర్వాత దుబాయ్ విమానాశ్రయం సమీపంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పలు విమానాలు రద్దయ్యాయి. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం (ఉశదీ) సమీపంలో జరిగిన డ్రోన్ ఇంధన ట్యాంక్‌ను ఢీకొట్టిన తర్వాత సోమవారం దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో మంటలు చెలరేగాయి అత్యవసర బృందాలు వేగంగా స్పందించి విమానాలను తాత్కాలికంగా నిలిపివేసాయి. యుఎఇ అత్యంత లక్ష్య దేశంగా మారిందని అధికారులు తెలిపారు.

దుబాయ్ సివిల్ డిఫెన్స్ సిబ్బందిని వెంటనే మంటలను అదుపు చేశారు. సమీపంలో భద్రతా చర్యలు చేపట్టడంతో ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. ఈమేరకు దుబాయ్ మీడియా ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టింది. దుబాయ్ విమానాశ్రయం దుబాయ్ విమానాశ్రయం నుండి అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కొన్ని విమానాలను మళ్లిస్తున్నట్లు కూడా ప్రకటించింది. విమానాశ్రయ రోడ్డు, విమానాశ్రయ సొరంగంను పోలీసులు మూసివేశారు.

**విమానాలు తిరిగి ప్రారంభం**

మరోవైపు ఇరాన్ డ్రోన్ దాడి తర్వాత కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసిన తర్వాత దుబాయ్ విమానాలను క్రమంగా తిరిగి ప్రారంభమైనాయి. ఇక్కడి నుండి కొన్ని విమానాలు క్రమంగా ఎంపిక చేసిన గమ్యస్థానాలకు తిరిగి ప్రారంభ మవుతున్నా యని దుబాయ్ సివిల్ ఏవియేషన్ అథారిటీ ఎక్స్ ద్వారా సమాచారం అందించింది. ప్రయాణీకులు తమ విమానాలకు సంబంధించిన వివరాలకోసం సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని పేర్కొంది.

విమానాశ్రయం సమీపంలో డ్రోన్ దాడి ఇదే మొదటిసారి కాదు. వరుస దాడుల మధ్య తమ సేనలు ఈ దాడులు తిప్పికొడుతున్న తరుణంగా లేటెస్ట్ అప్‌డేటస్‌ను ఫాలో కావాలని అధికారులు సూచించారు. ప్రస్తుత దాడులు ఈ ప్రాంతంలో కీలకమైన మౌలిక సదుపాయాల భద్రతపై పెరుగుతున్న ఆందోళనలను మరింత పెంచుతోంది.

# ఆస్కార్ ఫుడ్ మెనూ..! 600 పిజ్జాలు, 24-క్యారెట్ల ద్రవ బంగారం




**అమెరికా :** సినీ ప్రపంచం ఎంతగానో ఎదురుచూసిన ఆస్కార్ వేడుక ఘనంగా జరిగింది. మార్చి 16న అమెరికాలోని లాస్ ఏంజిల్స్ డాల్బీ థియేటర్ 98వ ఆస్కార్ అవార్డుల వేడుకకు వేదికగా నిలిచింది. మరి ఈ వేడుకకు వచ్చే అతిరథ మహారథులకు ఆస్కార అవార్డుల అనంతరం జరిగే విందు ఏ రేంజ్‌లో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రముఖులు, సెలబ్రిటీల కోసం ప్రత్యేక మెనూతో కూడిన వంటకాలను సర్వ్ చేయనున్నారు. ఈసారి ఆస్కార్ వేడుక అనంతరం జరిగే పార్టీలో ఏం వంటకాలు ఉన్నాయో చూద్దామా..!.

ప్రఖ్యాత చెఫ్ రెస్టారెంట్ వ్యాపారి వుల్ఫ్‌గ్యాంగ్ పుక్ ఈ ఆసార్క్ వేడుకకు వచ్చే అతిథులు తీవ్రమైన ఆకలితో ఉంటారని అందుకే పిజ్జా వంటి కంఫర్ట్ ఫుడ్(మనసుకు హాయినిచ్చే ఆహారం)ని ఇష్టపడతారని చెబుతున్నారు. ఈసారి విందుని 75 మంది ప్రధాన చెఫ్‌లు, 45 మంది పేస్ట్రీ చెఫ్‌లు, 325 మంది సేవా సిబ్బంది, నిర్వాహకులు కలిసి తయారు చేస్తారని అన్నారు. ఈ ఏడాది హాలీవుడ్ ప్రముఖులకు వడ్డించే వంటకాల మెనూలో ఏం ఉన్నాయంటే..

ఇలా ఆస్కార్ అతిథులకు రుచికరమైన ఆహారం వడ్డించడం అనేది పుక్ బృందానికి వరుసగా ఇది 32వ సంవత్సరం కావడం విశేషం. అందుకే ఈసారి 70కి పైగా వంటకాలు వడ్డించామని తెలిపారు పుక్. వీటిలో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ మార్పులు చేర్పులు ఏమిటంటే: జపనీస్ శైలి పబ్ ఆహారాన్ని అందించే 'live izakaya station', అప్పుడే తయారుచేసిన ఐస్‌క్రీమ్‌ను వడ్డించే ఇటాలియన్ 'gelato machine' వంటివి హైలెట్‌గా నిలవనున్నాయి.

ఈ ఏడాది మెనూలో 600 హోం మేడ్ పిజ్జాలు, అనేది ఇటాలియన్ పాస్తా మాదిరి శాకాహార వంటకం, బంగారు పొడితో అలంకరించిన రెండు వేల చిన్న చాక్లెట్ ఆస్కార్ విగ్రహాలు. ఈ చాక్లెట్ ఆస్కార్ విగ్రహాలపై రెండు గ్యాలన్ల 24-క్యారెట్ల 'ద్రవ బంగారం' వినియోగిస్తారట. మొత్తం 1500 మంది వంట చేసి సర్వ్ చేస్తారట. వంటకాలన్ని చాలా లైట్‌వైట్‌గా తయారు చేస్తారు. అలాగే ఈ వంటకాల కోసం ఇబ్బడిముబ్బడిగా సాస్‌లను వినియోగించరట.

ముఖ్యంగా వంటల్లో అన్ని నాణ్యమైన దినుసులనే వినియోగిస్తారట. వాటిలో దాదాపు 91 కిలోల డ్రై-ఏజ్డ్ రిబే, 136 కిలోల హౌస్-స్మోక్డ్ సాల్మన్, 14 కిలోల కలుగా కేవియర్, 227 కిలోల వైల్డ్ మష్రఉమ్‌లు, 91 కిలోల నిషికి రైస్, 181 కిలోల చీజ్‌లు తదితరాలు ఉంటాయి. ఈ ఏడాది ఆస్కార్ వంటకాలు సర్వ్ చేసే మెనూ పేరు వచ్చేసి ఎలిగాన్స్ అండ్ కంఫర్ట్ కంబైన్.

అలాగే కొత్తవంటకాల ప్రయోగాలను పరిచయం చేయరట. ఎందుకంటే అవి అందరికీ పడకపోవచ్చు..ఏదైన హెల్త్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉండొచ్చు. అంతేకాదండోయ్ విందుతోపాటు మందు కూడా ఉంది. ఏకంగా 1700 షాంపైన్ బాటిళ్లు అతిథులకు సర్వ్ చేస్తారట. అలాగే ఈ విందులో మిగిలిపోయిన ఆహారాన్ని లాస్ ఏంజెల్స్‌లో ఉంటున్న నిరాశ్రయ ప్రజలకు పంపిణీ చేస్తారట.

# తండ్రులకు మచ్చ తెస్తున్న తనయులు

**నాడు డ్రగ్స్ కేసులో ఎమ్మెల్యే ఆది తనయుడు సుదీర్‌రెడ్డి**

**తాజాగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ తనయుడు మహేష్ యాదవ్**

**హైదరాబాద్ కేంద్రంగా డ్రగ్స్ వ్యవహారంలో తలమునకలు**

**తీవ్ర చర్చనీయాంశంగా మారిన వ్యవహారం**




**కడప:** ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆ ఇద్దరు భాగస్వామ్య ఎమ్మెల్యేలు. ఆయా నియోజకవర్గాల్లో వారు శాసిస్తున్నా, తనయులు చట్టాలకు లోబడి మసలుకోవడంలో కట్టడి చేయలేకపోయారు. నిషేధిత మత్తు పదార్థాలు సేవిస్తూ పోలీసులకు పట్టుబడడంతో అభాసుపాలవుతున్నారు. ఫలితంగా ఆయా ఎమ్మెల్యేలకు 'సన్'స్ట్రోక్ తప్పడం లేదు. వారే మైదుకూరు, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు సుధాకర్‌యాదవ్, ఆదినారాయణరెడ్డి. సరిగ్గా రెండున్నర నెలల వ్యవధిలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యే తనయులు ఇద్దరూ డ్రగ్స్ తీసుకుంటూ పోలీసులకు పట్టబడడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పైగా పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడు మహేష్ యాదవ్ ఎంపీ కావడం గమనార్హం.

జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తనయుడు స్యుదీర్‌రెడ్డి ఈ ఏడాది జనవరి 3న డ్రగ్స్ కేసులో హైదరాబాద్ నార్సింగ్ పోలీసులకు చిక్కారు. పరీక్షలు నిర్వహించిన పోలీసులు డ్రగ్స్ పాజిటివ్ రావడంతో అదుపులోకి తీసుకున్నారు. ఆపై డ్రగ్ ఆడిక్షన్ సెంటర్‌కు అప్పగించారు. అప్పట్లో ఈవార్త తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. తాజాగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తనయుడు ఏలూరు పార్లమెంటు సభ్యుడు మహేష్‌యాదవ్ ఈగల్ టీమ్ పోలీసులకు పట్టుబడ్డారు. తెలంగాణ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఫామ్ హౌస్‌లో అనూహ్యంగా శనివారం రాత్రి పోలీసులకు చిక్కారు.

మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ తనయుడు మహేశ్‌యాదవ్ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడుకు అల్లుడు కావడంతో ఏలూరు లోక్‌సభ టీడీపీ అభ్యరి?థత్వం దక్కింది. ఆపై ఎన్నికల్లో పార్లమెంటు సభ్యుడుగా ఎన్నికయ్యారు. ఏలూరు ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తాజాగా డ్రగ్స్ తీసుకుంటూ పోలీసులకు చిక్కడం తెలుగురాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది. స్థాయి పెరిగినా వ్యక్తిత్వ లోపం...

ఎమ్మెల్యే కొడుకు.. ఆపై ఎంపీ హోదా.. ఉన్నతంగా వ్యవహరించాల్సింది పోయి ఇలా డ్రగ్స్ కేసులో దొరకడంపై ప్రజలు తూర్పారబడుతున్నారు. స్థాయి..హోదా పెరిగినా తన బుద్దిని బహిర్గతం చేసుకున్నారని విశ్లేషకులు దెప్పిపొడుస్తున్నారు. కాంట్రాక్టర్‌గా హైదరాబాద్‌లో స్థిరపడినప్పటికీ ప్రజాజీవితంతో ముడిపడి ఉన్నప్పుడు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది. ఇవేవి లెక్క చేయకుండా ఏకంగా డ్రగ్స్ వ్యవహారంలో దొరికిపోవడంతో జిల్లాలో నవ్వులపాలయ్యారు.

2014 ఎన్నికల ముందు కూడా మహేష్‌యాదవ్ బ్రహ్మంగారిమఠం మండలానికి చెందిన వారి సామాజిక వర్గానికే చెందిన ఓ నేతను ఇష్టానుసారంగా దూషించారు. కులంపేరుతో రెచ్చగొట్టే చర్యలకు దిగారు. ఇదంతా సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. దాంతో అంతో ఇంతో మద్దతుగా నిలిచిన నేతలు సైతం రాత్రికి రాత్రే దూరమయ్యేలా మహేష్ యాదవ్ వ్యవహారశైలి కని?పంచింది. ఆ ఎన్నికలల్లో టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న పుట్టా సుధాకర్ యాదవ్ ఓటమికి అది కూడా ఓ ప్రధాన కారణంగా నిలిచిందని పలువురు వెల్లడిస్తున్నారు. అప్పట్లో ప్రత్యక్ష రాజకీయాల్లో క్రీయాశీలకంగా లేరని సర్దిచెప్పుకున్నా, తాజాగా డ్రగ్స్ వ్యవహారంలో పట్టుబడడంతో తన బుద్ధి పోనిచ్చుకోలేదని పలువురు నిలదీస్తున్నారు.

**తండ్రులకు మచ్చ తెస్తున్న తనయులు...**

జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తనయుడు స్యుదీర్‌రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ తనయుడు మహేష్‌యాదవ్ డ్రగ్స్ తీసుకుంటూ పోలీసులకు పట్టుబడి వారి తండ్రులకు మచ్చ తీసుకొచ్చారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఈవ్యవహారంలో ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న మహేష్‌యాదవ్ మరింతగా చెడ్డపేరు మూటగట్టుకున్నారు. రక్త నమూనాలో డ్రగ్స్ శాంపిల్స్ పాజిటివ్ లభించినా పార్లమెంటు సభ్యుడు కావడంతో స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపినట్లు సమాచారం. గడిచిన ఐదు నెలల క్రితం సైబర్ నేరస్తుల వలలో చిక్కుకున్న ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్‌కు తాజాగా 'సన్'స్ట్రోక్ భారీగా తగిలింది.

# ఎల్‌పీజీ సంక్షోభంపై కేంద్రం అబద్దాలు చెబుతోంది : మల్లిఖార్జున ఖర్గే

(మొదటి పేజీ తరువాయి)

హాస్టళ్లు , వాణిజ్య వినియోగ దారులను ప్రభావితం చేస్తోంది. ప్రస్తుత పరిస్థితిలో, ఎల్‌పిజి లభ్యత, ధర స్థిరత్వం తీవ్రమైన సమస్యలుగా మారాయనే విషయాన్ని కేంద్రం గుర్తించాలన్నారు. కేంద్ర పెట్రోలియం మంత్రి ఎల్‌పిజి కొరత లేదని లోక్‌సభలో ప్రకటించిన వైనాన్నిఆయన ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చెబుతున్న వాదనలు తప్పు అని వాస్తవాలు రుజువు చేస్తున్నామని మండిపడ్డారు. హోర్ముజ్ జలసంధి దిగ్బంధనంతో తలెత్తిన ఇంధన సంక్షోభాన్ని ప్రభుత్వం సరిగ్గా నిర్వహించలేదని ఖర్గే ఆరోపించడంతో జీరో అవర్ సమయంలో ఘర్షణ చెలరేగింది. దేశవ్యాప్తంగా ఎల్‌పిజి సిలిండర్ల తీవ్ర కొరతకు ప్రభుత్వమే కారణమని ఖర్గే అన్నారు. మధ్యతరగతి , పేద కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని అన్నారు. రెస్టారెంట్లు, హాస్టళ్లు కమ్యూనిటీ కిచెన్‌లను మూసివేయాల్సి వచ్చిందని, ఎల్‌పిజి సిలిండర్లను అధిక ధరలకు అమ్ముతున్నారని ఆయన పేర్కొన్నారు.

దేశంలో 60 శాతం ఎల్‌పిజి దిగుమతి అవుతుందని, ఇందులో 90 శాతం సరఫరా హోర్ముజ్ జలసంధి ద్వారా జరుగుతుంద న్నారు. ప్రపంచ చమురు సంక్షోభానికి దారితీసే కీలకమైన సముద్ర మార్గం ఇది అని అన్నారు. ఎల్‌పిజి సరఫరాపై కేంద్రం ముందస్తు ప్రణాళిక వేసుకుని ఉంటే, ఈపరిస్థితి తలెత్తేది కాదన్నారు. ఖర్గే ఎరువుల సరఫరా కొరతను కూడా ఎత్తిచూపారు.

అలాగే సిలిండర్ కోసం వెయిటింగ్ సమయాన్ని కూడా 21 - 25 రోజులకు పెంచారు, ఇది, బ్లాక్ మార్కెటింగ్‌కు దారితీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంక్షోభం ప్రభుత్వ పేలవమైన ప్రణాళిక నిదర్శనమని, ఇది విదేశాంగ విధానంపై కూడా ప్రశ్నలను లేవనెత్తుతుదని ఖర్గే మండిపడ్డారు. ప్రణాళిక లేకపోవడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెట్రోలియం మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి దేశంలో ఎల్‌పిజి సరఫరాపై తప్పుడు సమాచారం ఇస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు.

**నడ్డా కౌంటర్**

ఖర్గే విమర్శలతో సభలో వేడి రాజుకుంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు, నడ్డా కూడా స్పందించారు. జీరో అవర్ కారణంగా సభ్యులు ప్రజా సమస్యలపై లేవనెత్తాల్సిన అవసరం ఉందని, చైర్ జోక్యం చేసుకోవాలని నడ్డా కోరారు. సభలో తీవ్రమైన అంశాలపై చర్చలు జరుగుతున్నపుడు వాటిపై శ్రద్ధపెట్టకుండా ప్రతిపక్షాలు గందరగోళం సృష్టిస్తున్నాయని ఆరోపించారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు ఞా+ సమస్యపై మాట్లాడకుండా ఇతర అంశాలపై మాట్లాడటానికే మొగ్గు చూపారంటూ రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు.

**ప్రతిపక్షాల ఆందోళన**

అయితే ప్రతిపక్షాలు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, సంక్షోభం విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడిని కొనసాగించాయి. ప్రతిపక్షాల వైపు నుంచి గందరగోళం కొనసాగుతుండగానే, సభ ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ముగించాలని ఖర్గేను కోరారు. ఖర్గే చేసిన ఆరోపణలకు బదులిస్తూ, నడ్డా ప్రతిపక్షాలపై ఎదురుదాడికి దిగారు. క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా రాజకీయాలు చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటేనని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాదు అసలు ఈ సంక్షోభం దేశం వల్ల కాదని, ప్రపంచవ్యాప్త కారణాల వల్లే తలెత్తిందని పేర్కొన్నారు. కాగా దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తులు మరియు వంట గ్యాస్ నిరంతరాయంగా లభ్యతను నిర్ధారించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే.

# కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల కేటాయింపు షురూ

(మొదటి పేజీ తరువాయి)

రాజస్థాన్ రాష్ట్రాలు అధికారిక ఉత్తర్వులు జారీ చేశాయి. గృహ వినియోగ గ్యాస్ మళ్లింపును అరికట్టడానికి, వాణిజ్య అవసరాలకు అంతరాయం కలగకుండా చూడటానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పెట్రోలియం శాఖ స్పష్టం చేసింది. ఈ నూతన విధానం వల్ల పండుగల సీజన్‌లో, రద్దీ సమయాల్లో వాణిజ్య గ్యాస్ కొరత తలెత్తకుండా ఉంటుందని పరిశ్రమ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీ రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు

(మొదటి పేజీ తరువాయి)

తానే తెచ్చానని కౌశిక్ ఒప్పుకున్నాడు. సిమ్లా బిజినెస్ ట్రిప్‌కు వెళ్లినప్పుడు తానే కొకైన్ తీసుకొని వచ్చానని చెప్పాడు.'అని తెలిపారు.

**ఫామ్ హౌస్ డ్రగ్స్ పార్టీ రిమాండ్ రిపోర్టులో సంచలన నిజాలు**

నగరానికి అతి చేరువలో ఉన్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఫాంహౌస్ గతంలో ఎమ్మెల్యేల కొనుగోలు ఒప్పందానికి వేదికగా మారింది. పోలీసులు దాడి చేసి ఆ గుట్టును రట్టుచేశారు. తాజాగా శనివారంరాత్రి ఆయన ఫాంహౌస్‌లో డ్రగ్స్ పార్టీ జరుగుతుండగా ఈగల్ టీం పోలీసులు అక్కడికి చేరుకోగా గన్‌తో కాల్పులు జరపడం సంచలనంగా మారింది. ఇందులో ఏపీకి చెందిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి, మరో తొమ్మిది మంది పట్టుబడ్డారు.

# అసెంబ్లీలో చిరునవ్వులు రాజాసింగ్‌ను ఆటపట్టించిన కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యే కాలే యాదయ్యను బీఆర్ఎస్ వైపు కూర్చోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కోరారు. కానీ, కాలే యాదయ్య మాత్రం తాను కాంగ్రెస్ వైపే కూర్చుంటానని చెప్పుకొచ్చారు. ఇక, ఇటీవలే పది మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఫిరాయింపుల విషయంలో క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే.

# పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని తెలుగుజాతి గుర్తుంచుకోవాలి: చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

కొనియాడారు.

**స్వార్థంలేని పోరాటం చేసిన వ్యక్తి: నారా లోకేశ్**

స్వార్థం లేని పోరాటం చేసిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ' నా దీక్షకు ఎవరూ స్థలం ఇవ్వకపోతే.. రోడ్డుపైనే చేస్తానని అమరజీవి ప్రకటించారు' అని అన్నారు. త్యాగానికి మానవరూపం పొట్టి శ్రీరాములు అని చెప్పారు. " ఆంధ్ర రాష్ట్రం రూపంలో పొట్టి శ్రీరాములు జీవించే ఉన్నారు. అమరావతిలోని అమరజీవి విగ్రహం తెలుగువాళ్లను అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్తుంది. తెలుగువాళ్లమని గర్వంగా చెప్పుకొంటున్నామంటే దానికి కారణం ఆయనే" అని నారా లోకేశ్ అన్నారు.

# సిలిండర్లు దుర్వినియోగం కాకుండా చూడాలి: చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

తగ్గించుకునేలా హోటల్ సంఘాలతో మాట్లాడాలని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటకకు మరిన్ని కేటాయింపులు జరపనున్నట్లు అధికారులు వెల్లడించారు. పైప్‌లైన్, ఇండక్షన్ స్టవ్స్ అందుబాటులోకి తెచ్చే అంశం పరిశీలించాలని సీఎం వారికి సూచించారు.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలు 5,500కు పైగా విమానాలు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుత సంక్షోభ సమయంలో విమానయాన కార్యకలాపాల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. పౌర విమానయానశాఖ, డీజీసీఏలు పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయి. అవకాశం లభించినప్పుడల్లా విమానాలు నడుపుతున్నాం. ఇలా ఇప్పటివరకు దాదాపు 2.19 లక్షల మందిని చేరవేశాం. ఇప్పటికీ కొన్ని గగనతలాలు మూసిఉన్నాయి. అవి అందుబాటులోకి వచ్చి, సురక్షిత పరిస్థితులు ఏర్పడినప్పుడే విమానాల రాకపోకలు సాధారణ స్థితికి చేరుకోగలవు" అని ప్రశ్నోత్తరాల సమయంలో ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమాధానం ఇచ్చారు.

**పశ్చిమాసియా గగనతలంలో ప్రళయకాల విమానం..**

గతేడాది డిసెంబరులో ఇండిగో విమానాలు పెద్దసంఖ్యలో రద్దయిన వ్యవహారంలో.. ప్రయాణికులకు ట్రావెల్ కూపన్ల రూపంలో రూ.163.92 కోట్ల మేర పరిహారం ఇప్పటికే అందినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రయాణికులకు మరింత పరిహారం చెల్లించేలా విమానయాన సంస్థతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు.

విశాఖ సమాచారమ్
మంగళవారం 17-3-2026

# యువత పెళ్లికి ఎందుకు దూరమవుతోంది?

భారతీయ సమాజంలో యువత పెళ్లి చేసుకోవడానికి ఎందుకు వెనక్కి తగ్గుతున్నారు? పెళ్లి వయస్సు పెరగడం, ఆర్థిక అస్థిరత, సోషల్ మీడియా ప్రభావం, పెరుగుతున్న అంచనాలు వంటి కారణాలతో కుటుంబ వ్యవస్థ ఎలా మారుతోంది అనే విషయంపై విశ్లేషణాత్మక వ్యాసం.

యువత పెళ్లికి ఎందుకు దూరమవుతోంది?

భారతీయ సమాజంలోని కుటుంబ వ్యవస్థలో ప్రస్తుతం నిశ్శబ్దంగా ఒక పెద్ద సామాజిక మార్పు వస్తుంది. అదేమిటంటే యువకులు పెళ్లి చేసుకోవడానికి వెనక్కి తగ్గడం. ఒకప్పుడు భారతీయ కుటుంబ వ్యవస్థలో పెళ్లి ఒక సహజ దశ. ఇరవై నుంచి ఇరవై అయిదు సంవత్సరాల మధ్యలో పెళ్లి చేసుకోవడం సాధారణం. కుటుంబ పెద్దలు చూసిన పెళ్లి, సమాజం అంగీకరించిన బంధం, ఆ తర్వాత పిల్లలు, కుటుంబం, సమాజంలో స్థానం. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

నేటి యువకులు.. 'ఇంకా సెటిల్ కాలేదు, సరైన అమ్మాయి దొరకలేదు.. బాధ్యతలు భయంగా ఉన్నాయి, పెళ్లి తర్వాత స్వేచ్ఛ పోతుంది. విడాకుల ప్రమాదం ఉంది'. ఈ మాటలు ఇప్పుడు అరుదు కాదు. ఇవి ఒక కొత్త తరం ఆలోచనల ప్రతిబింబం.

చరిత్రలో పెళ్లి.. ఒక ధర్మం!

పురాతన భారతీయ సమాజంలో పెళ్లి ఒక పవిత్రమైన ధర్మం. సమాజానికి ఆర్థిక బలం కుటుంబం, సంస్కృతి కొనసాగింపు కుటుంబం, పిల్లల పెంపకం కుటుంబం, అందుకే పెళ్లి చేయకపోవడం ఒక అసాధారణం. ఇండస్ట్రియ ల్ రివల్యూషన్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా కుటుంబ వ్యవస్థలో పెద్ద మార్పులు వచ్చాయి.. ముఖ్యంగా మూడు అంశాలు పెళ్లి వ్యవస్థను ప్రభావితం చేశాయి. నగరీకరణ, గ్రామాల నుంచి నగరాలకు వలస పెరిగింది. నగరాల్లో జీవితం వ్యక్తిగతంగా మారింది. విద్య, యువత ఎక్కువ కాలం చదువుకోవడం ప్రారంభించింది. వ్యక్తిగత స్వేచ్ఛ, వ్యక్తిగత నిర్ణయాలకు ప్రాధాన్యం పెరిగింది. ఈ మూడు మార్పులు కలిసి పెళ్లి వ్యవస్థను మెల్లగా మార్చాయి.

పెళ్లి వయస్సు భారీగా పెరుగుతోంది!

భారతదేశంలో గత 50 సంవత్సరాల్లో పెళ్లి వయస్సు గణనీయంగా పెరిగింది. 1970లో పురుషుల సగటు పెళ్లి వయస్సు 21 సంలు, మహిళల సగటు పెళ్లి వయస్సు 18 సంలు, 1990లో పురుషుల సగటు పెళ్లి వయస్సు 24, మహిళల సగటు పెళ్లి వయస్సు 20, 2010లో పురుషుల సగటు పెళ్లి వయస్సు 27, మహిళల సగటు పెళ్లి వయస్సు 23 సంలు కాగా, 2025 లో పురుషుల సగటు పెళ్లి వయస్సు 30+ సంలు మహిళల సగటు పెళ్లి వయస్సు 27 సంలు, ఈ మార్పు కేవలం గణాంకం కాదు.. ఇది సమాజం మారుతున్న సంకేతం. గత రెండు దశాబ్దాల్లో భారతదేశంలో ఒక కొత్త సామాజిక ధోరణి కనిపిస్తోంది. అది ఏమిటంటే 30 సంవత్సరాలు దాటిన తర్వాత కూడా పెళ్లి కాని పురుషుల సంఖ్య పెరగడం.

పర్ఫెక్షన్ మైండ్‌సెట్ కారణంగా..

నేటి యువతలో ఒక పెద్ద సమస్య పర్ఫెక్షన్ మైండ్‌సెట్. అంటే, అమ్మాయి అందంగా ఉండాలి. మంచి ఉద్యోగం ఉండాలి. మంచి కుటుంబం కావాలి. స్వభావం కూడా పరిపూర్ణం కావాలి. ఈ అంచనాలు చాలా ఎక్కువగా ఉంటాయి. ఇదే సమయంలో అమ్మాయిల అంచనాలు కూడా పెరిగాయి. వాళ్లు కోరేది, అధిక జీతం, మంచి స్టేటస్, విదేశీ అవకాశాలు మొదలైనవి. దీంతో పెళ్లి మార్కెట్ అసమ తుల్యత ఏర్పడింది. డేటింగ్, సోషల్ మీడియా యాప్స్ సంబంధాలపై పెద్ద ప్రభావం చూపుతున్నాయి. ఇవి రెండు సమస్యలను సృష్టించాయి. ఒకటి పోలికలు, ఇతరుల జీవితా లతో పోల్చుకోవడం. రెండోవది ఎంపికల భ్రమలు ఎప్పుడైనా మరొక మంచి ఎంపిక దొరుకుతుందని భావించడం. ఇది నిర్ణయం తీసుకోవడాన్ని ఆలస్యం చేస్తుంది. నేటి యువకుడు ఎదుర్కొంటున్న మరో ప్రధాన సమస్య ఆర్థిక అస్థిరత. నగరాల్లో జీవన వ్యయం భారీగా పెరిగింది. ఇలాంటి పరిస్థితిలో ఇంకా నేను స్థిరంగా లేను. ఇప్పుడు పెళ్లి అంటే బాధ్యతల భారమేనని యువకులు ఆలోచిస్తున్నారు. ఇటీవలి సంవత్సరాలలో విడాకుల కేసులు పెరడగం కూడా కొంతమంది పెళ్లి చేసుకోవడం కంటే ఒంటరిగా ఉండటం సురక్షితమని భావిస్తున్నారు..

మారుతున్న సమీకరణలు..

నేటి మహిళలు చదువుకున్నవారు, ఉద్యోగాలు చేస్తున్నారు. ఆర్థికంగా స్వతంత్రం, ఇది ఒక సానుకూల పరిణామం. కానీ కొన్ని సంబంధాల్లో, అధికార పోటీ, అహంకార ఘర్షణలు జరుగుతున్నాయి. విద్య ఉన్నా జీవన జ్ఞానం లేదు, ఇది చాలా ముఖ్యమైన అంశం. నేటి విద్యా వ్యవస్థ, ఉద్యోగం ఎలా సంపాదించాలో నేర్పుతుంది. కానీ సంబంధాలను ఎలా నిర్వహించాలి నేర్పదు.. దీంతో యువతలో సహనం తగ్గింది. సంబంధాల నిర్వహణ కష్టం అయింది. సింగిల్ జీవితం 25 వరకు స్వేచ్ఛలా అనిపిస్తుంది. కానీ 35 తర్వాత, ఒంటరితనం, భావోద్వేగ ఖాళీ, కుటుంబ అవసరం తీవ్రంగా అనిపిస్తుంది.

సహనం – అవగాహన ఆవశ్యం!

యువకులు పెళ్లికి భయపడటం అనేది కేవలం వ్యక్తిగత సమస్య కాదు.. ఇది సామాజిక, ఆర్థిక, మానసిక, సాంస్కృతిక సంక్షోభం. కాబట్టి పరిష్కారం కూడా వ్యక్తి, కుటుంబం, సమాజం, ప్రభుత్వం అనే నాలుగు స్థాయిల్లో రావాలి. ఈ ట్రెండ్ కొనసాగితే జనాభా తగ్గుతుంది, కుటుంబ వ్యవస్థ బలహీనమవుతుంది. ఒంటరి జీవితం పెరుగుతుంది, మానసిక సమస్యలు పెరుగుతాయి. అయితే ఈ సమస్యకు పరిష్కారం కూడా ఉంది. ముందుగా యువత తమ అంచనాలను కొంచెం తగ్గించుకోవాలి. జీవిత భాగస్వామి అనేది పరిపూర్ణంగా ఉండాల్సిన అవసరం లేదు. పెళ్లికి ముందు కౌన్సిలింగ్ కూడా చాలా ఉపయోగపడుతుంది. దీనివల్ల ఇద్దరి అంచనాలు స్పష్టంగా అవుతాయి. ఇక కుటుంబాలు కూడా తమ అంచనాలను తగ్గించుకోవాలి. కట్నం, స్టేటస్, సామాజిక పోలికలు వంటి ఒత్తిడులు తగ్గితే పెళ్లి ప్రక్రియ సులభమవుతుంది. సమాజం మారుతున్న ప్పటికీ పరస్పర గౌరవం, అవగాహన, సహనం ఉంటే కుటుంబ వ్యవస్థ మరింత బలంగా కొనసాగుతుంది.

# యుద్ధం: గెలుపు దేశాధినేతలది..

### కన్నీళ్లు సామాన్యుడివి!

చరిత్ర పుస్తకాలు తిరగేస్తే మనకు కనిపించేది కేవలం రాజుల విజయగాథలు, సామ్రాజ్యాల సరిహద్దులు మాత్రమే.

కానీ, ఆ విజయాల వెనుక ఉన్న అణిచివేయబడిన ఆర్తనాదాలు, ఆ గెలుపు కోటల కింద సమాధి అయిన సామాన్య సైనికుల కలలు ఎవరికీ కనిపించవు.

యుద్ధాన్ని ఎప్పుడూ ఎవ్వరూ ఆహ్వానించకూడదు. అన్ని రకాల ప్రత్యామ్నాయాలు విఫలమై అనివార్య పరిస్థితుల్లో మాత్రమే పోరుకు వెళ్లాలి, కానీ ప్రస్తుత ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలు మాత్రం అలాంటివి కాదని చెప్పడానికి పెద్దగా ఆలోచించాల్సిన అవసరమే లేదు. అనుమానాలు, అపోహలు, అపార్థాలు, అహంకారాలతో పెను యుద్ధాలు జరుగుతున్నాయి.

యుద్ధం వెనుక దాగి ఉన్న చేదు నిజాలు

సామాన్య ప్రజలే బలిపశువులు: యుద్ధాన్ని ప్రకటించేది పాలకులు, కానీ ప్రాణాలు అర్పించేది మాత్రం సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన సైనికులే. జయజయధ్వానాల మధ్య వారి త్యాగం త్వరగానే మరుగున పడిపోతుంది. చివరకు సామాన్య ప్రజలే బలిపశువులు.

గెలుపు సంబరాలు.. ఆపై విస్మృతి

మనం యుద్ధం గెలిచామని పండగ చేసుకుంటాం. కానీ, ఆ గెలుపు కోసం సరిహద్దుల్లో రక్తం చిందించిన సైనికుడి కుటుంబాన్ని మరుసటి రోజే మర్చిపోతాం. యుద్ధంలో గెలిచేది ఎప్పుడూ దేశాధినేతలే, కానీ అశువులు బాసేది మాత్రం సామాన్య సైనికులు. ఒకరు 'హీరో'గా వెలిగిపోవడానికి వేల కుటుంబాల్లో కన్నీటి దీపాలు ఆరిపోవాలా?

దేశాధినేతల అహంకారం – ఆధునిక రావణకాష్ఠం

నేటి ప్రపంచంలో యుద్ధాలు మనుగడ కోసం కాకుండా, కేవలం ఆధిపత్యం కోసం, 'మేం చెప్పిందే వేదం.. చేసిందే శాసనం' అనే అహంకారం వలన జరుగుతున్నాయి. గత శతాబ్దంలో రెండు ప్రపంచ యుద్ధాలు చూసి లక్షల మందిని కోల్పోయినా, మనిషికి బుద్ధి రాలేదు. ఆయుధ బలం ఉందనో, సైనిక శక్తి ఉందనో అకారణంగా సమరానికి దిగడం ఆధునిక నాగరికతకు చేటు.

మానవతా సంక్షోభం: గాజా నుంచి ఇరాన్ వరకు, ఉక్రెయిన్ నుంచి మరెన్నో దేశాల వరకు యుద్ధం వల్ల మిగిలేది కేవలం శిథిలాలు, శవాల కుప్పలే. పసిపిల్లల ప్రాణాలు సైతం ఈ రాజకీయ చదరంగంలో బలైపోతున్నాయి.

శాంతి ముసుగులో మాయమాటలు

అశోకుడు, అలెగ్జాండర్ కాలం నుండి నేటి వరకు యుద్ధం వల్ల ఏమీ సాధించలేమని అందరూ చెబుతూనే ఉన్నారు. కానీ నేటి నేతలు ఒక పక్క యుద్ధాలు సృష్టిస్తూనే, మరోపక్క శాంతి మంత్రాలు జపిస్తూ మాయమాటలు చెబుతున్నారు. పైకి శాంతి మంత్రాలు పఠిస్తూనే, లోపల ఆయుధ వ్యాపారాల కోసం, స్వప్రయోజనాల కోసం యుద్ధ తంత్రాన్ని నడిపే ద్వంద్వ నీతి సమాజానికి శాపం. తమ స్వప్రయోజనాల కోసం యుద్ధాన్ని ఒక ఆయుధంగా వాడుకుంటున్నారు.

యుద్ధం ఎప్పుడూ చివరి ప్రత్యామ్నాయం (ఘుర్ =వంశీతీ) కావాలి తప్ప, మొదటి ఆప్షన్ కాకూడదు. అశోకుడు కళింగ యుద్ధం తర్వాత పొందిన జ్ఞానోదయం నేటి పాలకులకు రాకపోవడం దురదృష్టకరం. యుద్ధం అంటే సరదా కాదు, అది ప్రాణాలతో ఆడే జూదం. ఇప్పటికైనా ప్రపంచ నేతలు తమ మొండి పట్టుదలను వీడాలి. "ఈ ప్రపంచం నా మాతృభూమి" అనే భావన పెంపొందించుకోవాలి. యుద్ధం వల్ల ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ ఏదో ఒక రూపంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యుద్ధాల కారణంగా ప్రపంచం మొత్తం సంక్షోభంలో కూరుకుపోయింది. బుల్లెట్ల కంటే మాటలతో, క్షిపణుల కంటే మానవత్వంతో సమస్యలను పరిష్కరించుకోవడమే రేపటి తరానికి మనం ఇచ్చే నిజమైన బహుమతి.

**డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు,**
**మాజీ రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం,**
**మేనేజింగ్ ట్రస్టీ, లయన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, విశాఖపట్నం.**

# సత్యసాయి చెప్పిన ప్రేమ సాధన

"మనుజ దేహమన్న మున్మయ భాండమే పగులనంతవరకూ పొగురుచుండు పగిలనేమి కొమికులు పరమాత్మ తత్వంబు సాయి చరణ రగం శాంతి నొసగు"

ప్రేమ మాధుర్యం మరచిన మానవ దేహం మట్టి కుండ కాక మరేమీ కాదు. విశ్వాసమే శ్వాసగా బతకాల్సిన మానవుడు ఆధ్యాత్మికం అనే గమ్యాన్ని మరచి మానవబంధాలనే అనుమానాలతో ఎండుటాకులాగా ఎగిరిపోతున్నాడు. దీనికి ఉదాహరణగా సత్యసాయి ఒక కథ చెప్పారు.

భగవంతుని అనుగ్రహం కోసం ఒక శునకం ఘోరతపస్సు చేసింది.ఆ తపస్సుకు కరుణించి పరమేశ్వరుడు ప్రత్యక్షమై వరం కోరుకో అన్నాడు.నేను మనుష్యుల మధ్య చాలాకాలం జీవించాను.వారు " జంతూనాం నరజన్మ దుర్లభం"అని తరచూ అనేవారు. దాంతో నాకు మానవ జన్మ ఎత్తాలనే కోరిక కలిగింది. ఆ దుర్లభమైన నరజన్మ ప్రసాదించమంది. దేవుడు తథాస్తు అన్నాడు.ఆ శునకం మరుజన్మలో మానవుడిగా జన్మించింది.కాని దురదృష్టవశాత్తు పూర్వజన్మ విశ్వాసం మరిచింది. ఈ జన్మలో భగవంతుని మరచి నాస్తిక సమాజం పెట్టాడు.అధ్యాత్మికం అనే నందనవనానికి దూరం అయ్యాడు. ఈష్యా,అసూయ,ద్వేషం అనే మూడు రాళ్ల పొయ్యి మీద అహంకారం,మమకారం అనే కారం పిండివంటలు వండుకుని తిన్నాడు.ఆ రుచికి బానిస అయ్యాడు.ప్రేమ మాధుర్యం లేక కష్టాలు, కడగండ్లతో జీవించాడు. అలాంటి స్థితిలో ఉన్న మానవుని ఉద్ధరించడానికి...

మానవుడిలో అంతరాలు తగ్గించే ఆధ్యాత్మిక జలాన్ని తాగించి దేహభ్రాంతి అనే కుండను పగలగొట్టి ప్రేమ మాధుర్యం చూపించడానికి కరుణతో భగవాన్ గా అవతరించారు. "మధురాతి పతే అఖిలం మధురం "మానవుడికి భగవంతుని పట్ల విశ్వాసం ఎలా ఉన్నా,భగవంతుడు ఎప్పటికైనా మానవుడు తనలో లీనమవ్వాలనే ప్రీతితో పూర్తి ప్రేమతో ఉంటాడు.

"జనులు జనులు కారు జనార్దన లీలయా
నరులు నరులు కారు నారాయణ లీలయా"

అన్నట్లు "మానవుడు మాధవుడిగా పరిణామం చెందాలి,అదే అతడి గమ్యం" అని సత్యసాయి చెప్పారు.

జంతువులకు లేని విద్య అనే ఖడ్గం,వివేకం అనే డాలు మానవుని మస్తిష్కం లో మాత్రమే ఉంటాయి. పూర్వజన్మ స్మృతి,జన్మ పరంపర,పాపపుణ్యాల కర్మల గుర్చి తెలుసుకునే జ్ఞానం ఉంది.అది గ్రహించలేక మానవుడు "నేను నేను"అనే అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్నాడు.బూడిదగా మారే ఈ శరీరం తానే అనుకుంటూ అజ్ఞానంలో పడ్డాడు. పాపం, శాపం,తాపం తో బంధింప బడ్డాడు. ధర్మచ్యుతికి పాల్పడడమే పాపం.ఇతర ప్రాణులను హింసించడమే శాపం.అశాశ్వతమైన దేహం శాశ్వతమని, జగత్తు మిధ్య అని తెలుసుకోకపోవడం తాపం.

దేహమనే ఉపకరణాన్ని దైవసేవకు ఉపయోగించాలని శంకరులు వివేకచూడామణిలో వివరించారు. మజ్జ,కొవ్వు, మాంసం,ఎముకలు, రక్తం, చర్మం వంటి సప్త ధాతువులతో మానవ శరీరం ఏర్పడుతుంది. "అన్నార్భవంతి భూతాని" అన్నారు గీతాచార్యుడు. తల్లిదండ్రులు భుజించిన ఆహారం అండం,శుక్లంగా మారి సంగమంతో బిడ్డ గా జన్మిస్తాడు.మరణానంతరం ఇతర జీవులకు ఆహారంగా మారుతాడు.అందుకే దాన్ని అన్నమయకోశమంటారు. ఈ సత్యం తెలుసుకుని దైవసేవలో దేహమనే ఉపకరణాన్ని ఉపయోగించుకోవాలని చెప్పాడు.

దీనికి సంబంధించి ఒక కథ ఉంది.

ఆచార పరాయణురాలైన ఒక స్త్రీ రాజస్తాన్ కు తీర్థయాత్ర లకు వెళుతుంది.ఆ ప్రాంతంలో జంతుచర్మాలతో తయారుచేసిన తోలుతిత్తి లో నీరు సరఫరా చేస్తారు.ఆ స్త్రీ దాహం అని అడిగితే ఒక వ్యక్తి తోలుతిత్తి లోని నీరు ఇస్తాడు.ఈ తోలుతిత్తి పరిశుద్ధమైనదేనా అని అడిగింది. దానికి అతడు అమ్మా! నీ శరీరమనే ఏ తోలుతిత్తిలో నీరు పోయబోతున్నారో దానికంటే ఇది పరిశుద్ధమైందని బదులిచ్చాడు.ఇప్పటికీ మరణం తర్వాత మానవ శరీరం పశుపక్ష్యాదులకు ఆహారంగా వేసే సాంప్రదాయం ఆ ప్రాంతంలో ఉంది.

"దేహమే క్షేత్రం,మనస్సే రైతు, పాపపుణ్యాలు పంట" అంటారు తులసీదాసు. "పునరపి జననం పునరపి మరణం" లాగా నిరంతరం ప్రయాణించే జీవుడి తుది గమ్యం జన్మ రాహిత్యమే.కాని దాన్ని సాధించాలంటే పట్టుదల,సత్కర్మలు చేయడమే మార్గమని అదే ఆధ్యాత్మిక మార్గమని స్వామి అన్నారు.జపం,ధ్యానం,సత్సంగం,నగర సంకీర్తన,సాధ్యాయం వంటి వాటిద్వారా 'సాధనమునసమకూరు ధరలోన' లక్ష్యంగా మానవ జీవితం ఉండాలన్నారు. సద్గుణ సంపత్తి ద్వారా ప్రేమ సాధన చెయ్యడమే అన్నిటికంటే గొప్పజీవితమని సత్యసాయి బోధించారు.

**యం.వి.రామారావు**

# జాతీయ టీకా దినోత్సవం

**ఇమ్యునైజేషన్ ఇప్పటికీ ఎప్పటికీ ఎంతో ముఖ్యమైనది.**
**(జాతీయ టీకా దినోత్సవం సోమవారం, 16 మార్చి 2026 సందర్భంగా)**

ప్రతి సంవత్సరం మార్చి 16న జరుపుకునే జాతీయ టీకా దినోత్సవం, టీకా ప్రయోజనాలను ప్రోత్సహించడానికి అంకితమైన రోజు. ఇది రోగనిరోధకత గురించి అవగాహన పెంచుతుంది మరియు నివారించగల వ్యాధుల నుండి వ్యక్తులు మరియు సమాజాలను రక్షించడంలో దాని పాత్రను హైలైట్ చేస్తుంది. ప్రతి ఒక్కరికీ, ప్రతిచోటా ప్రాణాలను రక్షించే టీకాలు అందుబాటులో ఉండేలా టీకా కవరేజ్ యొక్క ప్రాముఖ్యతను ఈ రోజు గుర్తు చేస్తుంది.

కోవిడ్-19 మహమ్మారి ఆరోగ్యం, సైన్స్ మరియు ప్రపంచ సంసిద్ధత గురించి మనం ఆలోచించే విధానాన్ని మార్చింది. దశాబ్దాలలో మొదటిసారిగా, టీకాలు రోజువారీ సంభాషణ అంశంగా మారాయి, ఇళ్ళు, కార్యాలయాలు మరియు ప్రభుత్వాలలో చర్చనీయాంశంగా మారాయి. కోవిడ్-19 టీకాలు లక్షలాది మంది ప్రాణాలను కాపాడాయి మరియు వేగవంతమైన ఇమ్యునైజేషన్ యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేశాయి.


వ్యాధులను నివారించడం, ప్రాణాలను కాపాడటం మరియు సంఘాలను బలోపేతం చేయడంలో, రోగనిరోధకత ఆధునిక వైద్యంలో అత్యంత శక్తివంతమైన సాధనాలలో ఒకటిగా కొనసాగుతోంది.

టీకాలు కొత్త హీరోలు కాదు. వంద సంవత్సరాలకు పైగా, వారు మానవాళిని లెక్కలేనన్ని ప్రాణాలను బలిగొన్న వ్యాధుల నుండి కాపాడారు. ప్రపంచవ్యాప్తంగా టీకా ప్రయత్నం కారణంగా 1980లో ప్రపంచవ్యాప్తంగా మశూచి నిర్మూలించబడింది, ఇది గొప్ప ప్రజారోగ్య విజయాలలో ఒకటిగా మిగిలిపోయింది, ఒకప్పుడు ప్రతి సంవత్సరం వేలాది మంది పిల్లలను పక్షవాతం చేసిన పోలియో, ఇప్పుడు నిర్మూలన అంచున ఉంది, కొన్ని దేశాలు మాత్రమే కేసులను నివేదిస్తున్నాయి. విస్తృతమైన రోగనిరోధక కార్యక్రమాల కారణంగా మీజిల్స్, టెటనస్, హెపటైటిస్, ఇన్ఫ్లుఎంజా మరియు అనేక ఇతర అనారోగ్యాలు గణనీయంగా తగ్గించబడ్డాయి లేదా నియంత్రించబడ్డాయి. ఈ విజయాలతో అంటు వ్యాధులపై పోరాటం ఇంకా ముగియలేదు.

కోవిడ్ అనంతర కాలంలో రోగనిరోధకత ఎందుకు కీలకంగా ఉందో ఇప్పుడు తెలుసుకుందాం:

పాత వ్యాధుల పునరుజ్జీవనాన్ని నివారించడం:

టీకాలు తీసుకోవడం తగ్గినప్పుడు, నివారించగల వ్యాధులు తిరిగి వస్తాయి. మహమ్మారి సమయంలో రోగనిరోధకత కార్యక్రమాలు మందగించిన అనేక దేశాలలో మీజిల్స్ వ్యాప్తి నివేదించబడింది. నిరంతర అప్రమత్తత లేకుండా, ఒకసారి నియంత్రించబడిన వ్యాధులు త్వరగా తిరిగి తలెత్తుతాయి.



జనాభాను రక్షించడం:

సాధారణంగా ప్రతి ఒక్కరికీ టీకాలు వేయబడవు. శిశువులు, వృద్ధులు మరియు బలహీనమైన రోగనిరోధక వ్యవస్థలు ఉన్న వ్యక్తులు రక్షణ కోసం అందరూ రోగనిరోధక శక్తిపై ఆధారపడతారు. అందుకే టీకా కవరేజ్ ఈ సమూహాలు సురక్షితంగా ఉండేలా చేస్తుంది.

ప్రపంచ ఆరోగ్య భద్రత:

జూఎ×ణ-19 సంక్షోభం, వ్యాధికారకాలు
దేశ సరిహద్దులను గౌరవించవని
మనకు గుర్తు చేసింది. అయితే బలమైన రోగనిరోధక కార్యక్రమాలు ప్రపంచ వ్యాప్తి ప్రమాదాన్ని తగ్గిస్తాయి మరియు ఆరోగ్యకరమైన మరింత మెరుగైన ప్రపంచాన్ని సృష్టిస్తాయి.

ఆర్థిక ప్రభావం:

టీకాలు ప్రాణాలను కాపాడటమే కాకుండా ఆరోగ్య సంరక్షణ ఖర్చులు మరియు అనారోగ్యంతో ముడిపడి ఉన్న ఆర్థిక నష్టాలను కూడా తగ్గిస్తాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం, రోగనిరోధకత కోసం ఖర్చు చేసే ప్రతి రూపాయి ఆరోగ్య సంరక్షణ పొదుపు మరియు ఉత్పాదకతలో 16 రెట్లు
తిరిగి ఇస్తుంది అని తెలుస్తోంది.

టీకాలో కొత్త సరిహద్దులు:

కరోనా మహమ్మారి వ్యాక్సిన్ టెక్నాలజీలో ఆవిష్కరణలను వేగవంతం చేసింది. ఒకప్పుడు ప్రయోగాత్మకంగా ఉన్న ఎ=చీూ వ్యాక్సిన్లు ఇప్పుడు ఇన్ఫ్లుఎంజా వంటి వ్యాధుల కోసం పరిశోధన చేయబడుతున్నాయి. వీూఎ మరియు హెపటైటిస్ బి వ్యాక్సిన్లు కొన్ని క్యాన్సర్లను కూడా నిరోధిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో మిలియన్ల మంది ప్రాణాలను రక్షించగల సార్వత్రిక ఫ్లూ వ్యాక్సిన్లు, సింగిల్-డోస్ పోలియో షాట్లు మరియు కొత్త మలేరియా వ్యాక్సిన్లను కూడా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్నారు. రోగనిరోధకత ఇకపై నివారణ గురించి కాదు, ఇది వ్యక్తిగతీకరించిన మరియు ఖచ్చితమైన వైద్యంలో ఒక సరిహద్దుగా మారుతోంది.

టీకా భయాన్ని ఎదుర్కోవడం:

స్పష్టమైన ప్రయోజనాలు ఉన్నప్పటికీ, టీకా భయం ఒక ప్రధాన అవరోధంగా ఉంది. తప్పుడు సమాచారం, సంస్థలపై అపనమ్మకం మరియు దుష్ప్రభావాల భయం కొంతమందిని టీకాలు వేయించుకోకుండా నిరోధిస్తాయి. ప్రజారోగ్య నిపుణులు పారదర్శక కమ్యూనికేషన్, సమాజ నిశ్చితార్థం మరియు విశ్వాసాన్ని పెంపొందించడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా టీకా అవసరాన్ని నొక్కి చెప్పాలి. తప్పుడు సమాచారం యొక్క ప్రమాదాలను మరియు స్పష్టమైన,
సైన్స్ ఆధారిత సందేశం యొక్క ప్రాముఖ్యతను వివరించాలి.

వ్యక్తులకు అతీతంగా సమిష్టి బాధ్యత:

టీకాలు వేయడం అనేది ప్రత్యేకమైనది, ఎందుకంటే దాని ప్రయోజనాలు వ్యక్తికి అతీతంగా విస్తరించి ఉంటాయి. ఎక్కువ మందికి రోగనిరోధక శక్తి ఇచ్చినప్పుడు, మొత్తం సమాజం సురక్షితంగా మారుతుంది. నవజాత శిశువులు మరియు క్యాన్సర్ రోగులు వంటి దుర్బల జనాభాను రక్షించేది ఈ హెర్డ్ ఇమ్యూనిటీ భావన. టీకాలు వేయడం ఎంచుకోవడం అనేది వ్యక్తిగత ఆరోగ్య నిర్ణయం మాత్రమే కాదు; ఇది సామాజిక బాధ్యత. నివారణ ఎల్లప్పుడూ ఉత్తమం.


ప్రపంచం సుపరిచితమైన మరియు ఉద్భవిస్తున్న వ్యాధులతో పోరాడుతున్నప్పుడు, రోగనిరోధకత
మన బలమైన రక్షణ మార్గంగా మిగిలిపోయింది. ఈ రోజు వ్యాక్సిన్లలో పెట్టుబడి పెట్టడం ఆరోగ్యకరమైన రేపటిని నిర్ధారిస్తుంది, ఇక్కడ నివారించగల అనారోగ్యం కారణంగా తక్కువ మంది ప్రాణాలు కోల్పోతారు.


కరోనా మహమ్మారి మనకు సైన్స్ యొక్క శక్తిని మరియు ఆరోగ్యం యొక్క దుర్బలత్వాన్ని గుర్తు చేసింది. టీకాలు తదుపరి జూఎ×ణ-వంటి సంక్షోభాన్ని ఆపడం గురించి మాత్రమే కాదు – అవి యుగాల నాటి బెదిరింపులు మరియు భవిష్యత్తు సవాళ్ల నుండి మానవాళిని రక్షించడం గురించి కూడా తెలియజేస్తాయి. రోగనిరోధకత ఇప్పటికీ ముఖ్యమైనది. ఎందుకంటే ఇది ఆరోగ్యకరమైన, సురక్షితమైన మరియు మరింత సమానమైన సమాజానికి ఉపయోగపడుతుంది.

అందుకే ఈనాటి పరిస్థితుల అనుగుణంగా అధికారిక ఇతివృత్తంతో పాటు, "వ్యాక్సిన్లు అందరికీ పని చేస్తాయి" అనే అంశంపై దృష్టి కేంద్రీకరించబడింది. ఈ ఇతివృత్తం టీకాలు కేవలం ఆరోగ్య జోక్యం మాత్రమే కాదు, ప్రాథమిక మానవ హక్కు అని నొక్కి చెబుతుంది. సకాలంలో అవసరమైన టీకాలు తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోని ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించండి.

**డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు,**
**మాజీ రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం,**
**మేనేజింగ్ ట్రస్టీ, లయన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, విశాఖపట్నం.**

# ట్రాయ్ యాప్స్ భలే!




ఇది అధికారిక డూ నాట్ డిస్టర్బ్ (డీఎన్‌డీ) యాప్. దీంతో మొబైల్ యూజర్లు తమ డీఎన్‌డీ ప్రిఫరెన్స్‌లను రిజస్టర్, మేనేజ్, అప్‌డేట్ చేసుకోవచ్చు. ఇది యూజర్ అనుమతి మేరకే వాణిజ్య కమ్యూనికేషన్లకు వీలు కల్పిస్తుంది. అవాంఛిత కాల్స్, ఎస్ఎంఎస్‌లు అందకుండా చేయటం దీని ఉద్దేశం. స్పామ్ కాలర్స్, ఎస్ఎంఎస్‌లను ట్రాయ్‌కు రిపోర్టు చేయొచ్చు కూడా. ఫిర్యాదుల స్థితిని ట్రాక్ చేయొచ్చు, టెలికం ఆపరేటర్ల ఎలాంటి చర్య తీసుకున్నారో తెలుసుకోవచ్చు. ప్రజల ఫీడ్‌బ్యాక్ ప్రకారం స్పామ్‌కు ఎక్కువ అవకాశం గల కాల్స్, మెసేజ్‌లను సమర్థంగా గుర్తిస్తుంది. రోజూ లక్షలాది మందికి స్పామ్ కాల్స్, మెసేజ్‌లు వస్తున్న నేపథ్యంలో ఇదెంతగానో ఉపయోగపడగలదు.

మొబైల్ ఇంటర్నెట్ వేగం, నెట్‌వర్క్ నాణ్యతను కొలిచే యాప్ ఇది. ఫోన్ నెట్‌వర్క్‌కు సిగ్నల్ కవరేజ్, డేటా స్పీడ్ (డౌన్‌లోడ్/అప్‌లోడ్) పరీక్షించటానికి తోడ్పడుతుంది. వేగం, నాణ్యతలో ఏదైనా తేడా ఉంటే ట్రాయ్‌కు సమాచారాన్ని చేరవేస్తుంది. ఇది సేవలు మెరుగుపడటానికి తోడ్పడుతుంది. మొబైల్ డేటా నెమ్మదించటం, నెట్‌వర్క్ సమస్యలను ట్రాయ్‌కు, సర్వీస్ ప్రొవైడర్లకు తెలియజేయొచ్చు. వీటి పరిష్కారానికిది బాగా ఉపయోగపడుతుంది.

# క్యారికేచర్ హవా!




చాట్‌జీపీటీ క్యారికేచర్లు ఇప్పుడు ఏఐ ట్రెండ్‌గా మారాయి. ప్రధానంగా తమ ఉద్యోగ నేపథ్యంతో క్యారికేచర్లను సృష్టించుకోవటానికి ఇష్టపడుతున్నారు. మీరూ ఓసారి ప్రయత్నిస్తారా? ముందుగా మీ క్లోజప్ ఫొటోను చాట్‌జీపీటీలో అప్‌లోడ్ చేయండి. ఫొటో మసకగా ఉండకూడదు. ముఖంలో హావభావాలు సహజంగా ఉంటే మంచిది. ఎలాంటి క్యారికేచర్ కావాలో నిర్ణయించుకోండి. ఇది మీరు అందించే ప్రాంప్ట్‌తో ముడిపడి ఉంటుంది. చాలామంది వాడుతున్న ప్రాంప్ట్ ఇదీ.. Create a caricature of me and my job based on everything you know about me..మీ గురించి అప్పటికే చాట్‌జీపీటీకి తెలిసి ఉన్నట్టయితే ఈ ప్రాంప్ట్ బాగా ఉపయోగపడుతుంది.

# భారత ఏఐ గవర్నెన్స్ మార్గదర్శకాల్లో మార్పులు




భారతదేశం ఇటీవల ఆవిష్కరించిన ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) పాలనా మార్గదర్శకాలు దేశ సాంకేతిక నియంత్రణ విధానంలో కీలకమైన మార్పును సూచిస్తున్నాయి. తక్షణమే కఠినమైన చట్టాన్ని అమలు చేయకుండా ప్రభుత్వం 'ఇన్నోవేషన్-ఫస్ట్' విధానాన్ని అవలంబిస్తున్నట్లు తెలుస్తుంది. దీని ద్వారా ఇప్పటికే ఉన్న చట్టాలకు అనుకూల సవరణలు చేసి ఏఐ వ్యవస్థలను నియంత్రించాలని నిర్ణయించింది.

ప్రభుత్వం ప్రత్యేకంగా కొత్త ఏఐ చట్టాన్ని ప్రతిపాదించకుండా ఏఐ వ్యవస్థలను నియంత్రించడంలో ఉన్న లోపాలను గుర్తించడానికి ఇప్పటికే ఉన్న చట్టాలను సమగ్రంగా సమీక్షించాలని పిలుపునిచ్చింది. ఏఐ రంగంలో వేగంగా ఆవిష్కరణలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈమేరకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సవరణలు వీటిలోనే..

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, 2000

డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ చట్టం 2023

ఏఐ వ్యవస్థలు స్వయంగా డేటాను సవరించడం లేదా ఉత్పత్తి చేయడం వల్ల ఇంటర్మీడియరీల(మధ్యవర్తుల) ప్రస్తుత రక్షణ నిబంధనలకు సవాలు ఏర్పడుతుంది. ఏఐ-సృష్టించిన కంటెంట్‌కు ఎవరు బాధ్యత వహిస్తారనే దానిపై నియంత్రణపరమైన స్పష్టత కొరవడింది. ఈక్రమంలో పైన తెలిపిన చట్టాల్లో ఈమేరకు సవరణలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఈ సమస్యను పర్యవేక్షించడానికి ప్రభుత్వం సంస్థాగత ఫ్రేమ్ వర్క్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. ఏఐ గవర్నెన్స్ గ్రూప్(ఏఐ గవర్నెన్స్‌ను పర్యవేక్షించే ప్రధాన సంస్థ), టెక్నాలజీ అండ్ పాలసీ ఎక్స్‌పర్ట్ కమిటీ (%భూజుజ%-నిర్దిష్ట చట్టపరమైన లోపాలను గుర్తించడం, సవరణలను ప్రతిపాదించడం, అమలును పర్యవేక్షించడం)వంటి వాటిని ప్రతిపాదించింది.

# ఏఐ బూమ్ ఎఫెక్ట్: ఫ్లాష్ మెమరీ కాంపోనెంట్ల కొరత




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) రంగంలో వృద్ధి కారణంగా ఏర్పడిన గ్లోబల్ ఫ్లాష్ మెమరీ కాంపొనెంట్ల కొరత వల్ల ఎల్ఈడీ టీవీల ధరలు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎల్ఈడీ టీవీలు సహా అనేక కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ధరలు కూడా పెరుగుతాయని భావిస్తున్నాయి. ఈ సంక్షోభానికి ప్రధాన కారణం ఫ్లాష్ మెమరీ కాంపొనెంట్ల తయారీలో కీలకంగా ఉన్న కంపెనీలు అధిక మార్జిన్ కలిగిన ఏఐ డేటా సెంటర్ల వైపు మళ్లడమేనని పరిశ్రమ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఫ్లాష్ మెమరీ ధరలు పెరుగుదల**

LED టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్స్‌లో విరివిగా ఉపయోగిస్తున్న ఫ్లాష్ మెమరీ ధరలు కొద్ది నెలల్లోనే భారీగా పెరిగాయి. వీడియోటెక్స్ డైరెక్టర్ అర్జున్ బజాజ్ తెలిపిన వివరాల ప్రకారం 1GB/8GB మెమరీ ధర ఏప్రిల్‌లో 2.61 డాలర్ల వరకు ఉండగా అక్టోబర్ నాటికి అది ఏకంగా 14.40 డాలర్లకు పెరిగింది. కేవలం మూడు నెలల్లోనే ఈ ధరల పెరుగుదల 50 శాతానికిపైగా చేరాయి. ఇది టీవీ తయారీదారుల ఇన్‌పుట్ ఖర్చులపై ఒత్తిడి పెంచింది.

**ఏఐ డిమాండ్:** సాధారణ ఎలక్ట్రానిక్స్‌కు అంతరాయం

సెమీకండక్టర్ పరిశ్రమలోని ప్రధాన కంపెనీలు ఏఐ మౌలిక సదుపాయాల వైపు దృష్టి సారించడమే ఈ కొరతకు మూలకారణం అని తెలుస్తుంది. చిప్ తయారీదారులు ఏఐ డేటాసెట్లలో ఉపయోగించే DDR6, DDR7 చిప్ సెట్‌ల ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తున్నారు. దీని కారణంగా టీవీలు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌ల్లో సాధారణంగా వాడే DDR3, DDR4 మెమరీ ఉత్పత్తి తగ్గిపోయింది.

ఎస్‌పీపీఎల్(థామ్సన్ బ్రాండ్ లైసెన్స్) సీఈఓ అవనీత్ సింగ్ మార్వా మాట్లాడుతూ..'2021-22 చిప్‌సెట్ కొరత తర్వాత ఫ్లాష్ మెమరీ అతిపెద్ద సమస్యగా ఉంది. త్వరలో ఎల్ఈడీ టెలివిజన్ ధరలు పెరుగుతాయి' అన్నారు. ఈ మెమరీ కాంపోనెంట్స్ ప్రధానంగా చైనా నుంచి దిగుమతి అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తయారీదారులు 2026 కోసం మెమరీ సెట్‌లను భద్రపరచడానికి పోటీ పడుతుండటంతో సరఫరా గొలుసు అంతరాయాలు పెరిగి ధరల ఒత్తిడి మరింత తీవ్రమైందని నిపుణులు చెబుతున్నారు.

**ఈ కొరత ఎప్పటివరకంటే..**

ఈ కొరత కనీసం ఆరు నుంచి పన్నెండు నెలల వరకు కొనసాగుతుందని ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రభావాన్ని తగ్గించడానికి కంపెనీలు తమ ఆర్డర్లను వ్యూహాత్మకంగా నిర్వహిస్తున్నాయి. ఇన్వెంటరీని క్రమబద్ధీకరిస్తున్నాయి.

టీవీలలో ఫ్లాష్ మెమరీని ఎందుకు ఉపయోగిస్తారంటే.. స్మార్ట్ టీవీలు ఆండ్రాయిడ్ టీవీ, వెబ్‌ఓఎస్ టైజెన్ వంటి ఆపరేటింగ్ సిస్టమ్‌లపై పనిచేస్తాయి. ఈ OS కోడ్, టీవీని నడిపించే ఫర్మ్‌వేర్ కోడ్ అంతా ఫ్లాష్ మెమరీలోనే శాశ్వతంగా నిల్వ అవుతుంది. టీవీని ఆన్ చేసినప్పుడు ఫ్లాష్ మెమరీలోని ఈ OS, ఫర్మ్‌వేర్ నుంచి డేటా లోడ్ అవుతుంది. అప్పుడే టీవీ పనిచేయడం మొదలవుతుంది. నెట్‌ఫ్లిక్స్ యూట్యూబ్ అమెజాన్ ప్రైమ్ వీడియో వంటి యాప్‌లను వినియోగదారులు డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయడానికి ఫ్లాష్ మెమరీ స్థలాన్ని అందిస్తుంది.

# మస్క్‌లాంటి వారు మాత్రమే సంపన్నులవుతారు!

కృత్రిమ మేధ (వేగంగా అభివృద్ధి చెందడం మొదలైనప్పటి నుంచి ఉద్యోగాల కోత సంచలనంగా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా చాలా కంపెనీలు వాటి కార్యకలాపాల్లో ఏఐని ఉపయోగిస్తూ వేలాది మంది ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏఐ గాడ్ ఫాదర్‌గా పిలువబడే జెఫ్రీ హింటన్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఏఐలో వస్తున్న మార్పు భవిష్యత్తులో కోట్లాది మందిని నిరుద్యోగులుగా మారుస్తుందని, ఈలోగా కేవలం ఎలాన్ మస్క్ వంటి కొద్దిమంది మాత్రమే ధనవంతులు అవుతారని జోస్యం చెప్పారు.

**కంపెనీల వైఖరి**

ఇప్పటికే టెక్ దిగ్గజాలైన ఐబీఎం, టీసీఎస్, గూగుల్, అమెజాన్ వంటి కంపెనీలు ఏఐని అమలు చేస్తూ పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నాయి. అయితే ఈ ధోరణి ఇప్పట్లో ఆగిపోయే అవకాశం లేదని హింటన్ బ్లూమ్‌బెర్గ్‌కు ఇచ్చిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఉద్యోగాలు కోల్పోకుండా ఏఐతో ముందుకు వెళ్లే మార్గం ఉందా అని అడిగినప్పుడు 'అది సాధ్యం కాదని నమ్ముతున్నాను. డబ్బు సంపాదించాలంటే మానవ శ్రమను భర్తీ చేయాలి. అందుకు ఏఐను వాడుతున్నారు. కంపెనీలు లాభాలు పెంచుకునేందుకు ఈ




పంథాను వినియోగిస్తున్నాయి' అన్నారు.

**ఏఐ సమస్య కాదు.. సామాజిక సమస్య..**

ఏఐ అభివృద్ధి వల్ల ఏర్పడే ఆర్థిక అసమానతపై జెఫ్రీ హింటన్ మాట్లాడుతూ.. 'టెక్ బిలియనీర్లు మాత్రమే ఈ రేసులో విజేతలుగా నిలుస్తారు. గణనీయ సంఖ్యలో ఉద్యోగుల స్థానంగా ఏఐ పని చేస్తుంది. మస్క్ వంటి వ్యక్తులు మాత్రమే ధనవంతులు అవుతారు. చాలామంది ఉద్యోగాలు కోల్పోతారు. ఇది ఏఐ సమస్య కాదు, సామాజిక సమస్య. ఏఐ మన సమాజాన్ని, మన ఆర్థిక వ్యవస్థను ఎలా నిర్మిస్తుందనేది నిశితంగా గమనించాలి' అన్నారు.

# ఇన్‌ఫెక్షన్లతో గుండెపోటు

గుండెపోటు, పక్షవాతం ముప్పు తగ్గించుకోవాలని అనుకుంటున్నారా? అయితే ఇన్‌ఫెక్షన్ జబ్బుల నివారణ మీదా దృష్టి పెట్టండి. ఫ్లూ, కొవిడ్ వంటి తక్షణ ఇన్‌ఫెక్షన్ల బారినపడ్డ కొద్దివారాల తర్వాత గుండెపోటు, పక్షవాతం ముప్పు గణనీయంగా పెరుగుతున్నట్టు జర్నల్ ఆఫ్ ద అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌లో ప్రచురితమైన అధ్యయనం హెచ్చరిస్తోంది.

హెచ్‌పీవీ, హెపటైటిస్ బి, ఇతర వైరస్‌లు క్యాన్సర్‌కు కారణమవుతున్నట్టు తెలిసిన విషయమే. కానీ వైరల్ ఇన్‌ఫెక్షన్లకూ గుండెజబ్బుల వంటి సాంక్రమికేతర జబ్బులకూ మధ్య సంబంధం గురించి అంతగా తెలియదు. దీన్ని అర్థం చేసుకోవటానికే యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు ప్రయత్నించారు. దాదాపు 52వేల ప్రచురిత అధ్యయనాలను నిశితంగా విశ్లేషించారు. ఇందులో ఏం గుర్తించారంటే..

ఫ్లూ బారినపడినవారికి నెలలోపు గుండెపోటు ముప్పు 4 రెట్లు, పక్షవాతం ముప్పు 5 రెట్లు ఎక్కువగా ఉంటోంది.

కొవిడ్ అనంతరం 14 వారాల్లోపు గుండెపోటు, పక్షవాతం ముప్పులు 3 రెట్లు ఎక్కువగా ఉంటున్నాయి. ఏడాది వరకూ వీటి ముప్పు ఎక్కువగా ఉంటుండటం గమనార్హం.

వైరల్ ఇన్‌ఫెక్షన్లను ఎదుర్కొనే క్రమంలో రోగనిరోధక వ్యవస్థ ప్రతిస్పందనలో భాగంగా వాపుప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) ప్రేరేపితమవుతుంది. ఇది రక్తం గడ్డలు ఏర్పడే స్వభావాన్నీ ప్రోత్సహిస్తుంది. ఇన్‌ఫెక్షన్ నయమైన తర్వాతా వాపుప్రక్రియ, రక్తం గడ్డలు ఏర్పడటం కొనసాగొచ్చు. ఇవి రెండూ గుండె సామర్థ్యాన్ని తగ్గించేవే. వాపుప్రక్రియతో రక్తనాళాల్లో పూడికలు ఏర్పడటమే కాదు, అవి చిట్లిపోయే ప్రమాదమూ ఉంది. ఫలితంగా గుండెపోటు, పక్షవాతం ముప్పులూ పెరుగుతాయి.

దీర్ఘకాలంలోనూ: దీర్ఘకాల వైరల్ ఇన్‌ఫెక్షన్లతో బాధపడేవారిలోనూ గుండెరక్తనాళాల జబ్బుల



తీరును ఈ అధ్యయనంలో పరిశీలించారు.

హెచ్ఐవీ ఇన్‌ఫెక్షన్ గలవారికి గుండెపోటు ముప్పు 60%, పక్షవాతం ముప్పు 40% ఎక్కువగా ఉంటున్నాయి.

హెపటైటిస్ సి ఇన్‌ఫెక్షన్ గలవారికి గుండెపోటు ముప్పు 27%, పక్షవాతం ముప్పు 23% ఎక్కువగా ఉంటున్నాయి.

సర్పి (షింగెల్స్) గలవారికి గుండెపోటు ముప్పు 12%, పక్షవాతం ముప్పు 18% అధికంగా ఉంటున్నాయి.

**టీకాలతో రక్షణ**

ఫ్లూ, కొవిడ్, షింగెల్స్‌కు టీకాలు తీసుకుంటే గుండెపోటు, పక్షవాతం ముప్పులూ తగ్గుతున్నట్టు అధ్యయనంలో తేలింది. ఉదాహరణకు- ఫ్లూ టీకా తీసుకోనివారితో పోలిస్తే దీన్ని తీసుకున్నవారికి ఈ జబ్బుల ముప్పు 34% తక్కువగా ఉంటుండటం గమనార్హం. ఇన్‌ఫెక్షన్ల నివారణ చాలా ముఖ్యమనే విషయాన్ని ఇది గట్టిగా సూచిస్తోంది. అప్పటికే గుండెజబ్బులు, గుండెజబ్బు ముప్పు కారకాలు గలవారికిది మరింత ముఖ్యమని చెబుతున్నారు.

# 'అందుకు సారీ బ్రో': కంపెనీల కొత్త ట్రెండ్

**ఇంటర్నెట్ డెస్క్:** యాదృచ్ఛికంగా జరిగిన తప్పులకు కంపెనీలు, సెలబ్రిటీలు బహిరంగంగా క్షమాపణలు చెప్పడం చూస్తుంటాం. కానీ, ఇప్పుడు ఎలాంటి పొరపాట్లు చేయకుండానే సారీ చెప్పేస్తున్నారు. స్కోడా నుంచి ఫోక్స్‌వాగెన్ వరకు.. రిలయన్స్ నుంచి అదానీ వరకు.. హల్దీరామ్ నుంచి మింత్రా వరకు అనేక కార్పొరేట్ దిగ్గజ సంస్థలు, ప్రధాన బ్రాండ్లు బహిరంగంగా క్షమాపణలు చెబుతూ అధికారిక ప్రకటనలు విడుదల చేస్తున్నాయి. మరి ఉన్నట్టుండి ఇలా సారీ చెప్పడానికి కారణమేంటో తెలుసా..? అదే **'అఫీషియల్ అపాలజీ ట్రెండ్'..!**

**ఈ 'సారీ'లో ట్విస్ట్ అదే..**

అయితే, ఈ కంపెనీలో క్షమాపణలు చెబుతున్నది కుంభకోణాలు జరిగినందుకో.. కస్టమర్లకు నష్టం వాటిల్లినందుకో, వారు అసౌకర్యానికి గురైనందుకో కాదు..! చాలా మెరుగైన సేవలు అందిస్తున్నందుకు 'సారీ' చెప్పడమే ఈ 'అపాలజీ ట్రెండ్' ఉద్దేశం. "మీ అంచనాలకు మించి సేవలు అందిస్తున్నందుకు గానూ విచారం వ్యక్తంచేస్తున్నాం" అంటూ కంపెనీలు క్షమాపణలు తెలియజేస్తున్నాయి. అంటే, తమ సర్వీసులతో కస్టమర్లు ఆనందపడుతున్నారని, తమ ఉత్పత్తులకు వినియోగదారులు బానిసలవుతున్నారని పేర్కొంటూ ఇలా సారీ చెబుతున్నాయి. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో అధికారిక ప్రకటనలు విడుదల చేస్తున్నాయి. వాస్తవానికి ఈ 'అపాలజీ ట్రెండ్' గతేడాది ఫిలిప్పీన్స్‌లో ప్రారంభమైనప్పటికీ ఇప్పుడు ఉన్నట్టుండి ప్రపంచస్థాయిలో ట్రెండ్ అవుతోంది. దీంతో భారతీయ దిగ్గజ కంపెనీలు కూడా దీన్ని ఫాలో అవుతున్నాయి.

ఏయే కంపెనీలు ఎలా క్షమాపణలు చెప్పాయి..

"రిలయన్స్ డిజిటల్‌కు వచ్చే కస్టమర్లు కొంత అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిసింది. మా తగ్గింపు ధరలతో కస్టమర్లు షాకై మళ్లీ మళ్లీ ధరలు చెక్ చేసుకోవాల్సి వస్తోంది. సులభతరమైన ఈఎంఐ సదుపాయంతో ఎలక్ట్రానిక్స్ వస్తువులు అవసరం లేకపోయినా కొనుగోలు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు. ఇంత త్వరగా డెలివరీ ఎలా వచ్చిందని పొరుగువారు అడుగుతుంటే సమాధానం చెప్పలేకపోతున్నామని అంటున్నారు. టెక్ షాపింగ్‌ను సులభతరం చేసినందుకు గానూ మేం మనస్ఫూర్తిగా క్షమాపణలు తెలియజేస్తున్నాం" – రిలయన్స్ డిజిటల్

"మా సిమెంట్ కారణంగా కస్టమర్లు గోడలకు రంధ్రాలు చేయలేకపోతున్నారు. మేకులు




కొట్టలేకపోతున్నారు. ఏళ్లతరబడి గోడలు బలంగా ఉండటంతో తమకు ఇంటిని రెనోవేట్ చేసుకునే అవకాశం రావట్లేదంటూ కొంతమంది కస్టమర్లు ఫిర్యాదులు చేస్తున్నారు. మీ ఇళ్లను బలంగా తీర్చిదిద్దుతున్నందుకు గానూ క్షమాపణలు తెలియజేస్తున్నాం" – అదానీ అంబుజా సిమెంట్

"మా కార్ల వల్ల వినియోగదారులకు కొన్ని సైడ్‌ఎఫెక్ట్స్ ఎదురవుతున్నాయి. కుటుంబసభ్యులు, స్నేహితులు తరచూ కారు కావాలని అడుగుతున్నట్లు కొంతమంది ఫిర్యాదులు చేస్తున్నారు. వారాంతంలో సరదాగా బయటకు వెళ్తే అదికాస్తా లాంగ్ డ్రైవ్ అయిపోతుందంట. కారులో కూర్చుంటే క్యాబిన్‌లో కూర్చున్న అనుభూతి కలుగుతోందని చెబుతున్నారు. వీటికి గానూ మేం మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నాం" – ఫోక్స్‌వాగెన్

"మా పాటల వల్ల కొంతమంది పని మీద దృష్టి పెట్టలేకపోతున్నారని తెలిసింది. 'ఈ ఒక్క పాట వింటాం' అనే ఆలోచన సుదీర్ఘంగా సాగుతుండడంతో నిద్ర పోలేకపోతున్నారు. ఇందుకు మేం చింతిస్తున్నాం" – టీ సిరీస్

ఇవే కాదు.. స్కోడా, మింత్రా, హల్దీరామ్స్, కెవెంటర్స్, బనానా లీఫ్ తదితర బ్రాండ్లు కూడా పోస్టులు పెట్టాయి.

**కొత్త ప్రచారమేనా..?**

అయితే, ఈ కొత్త ట్రెండ్‌పై నెట్టింట భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. క్షమాపణకు ఓ అర్థం ఉంటుందని, జవాబుదారీతనం ఉంటుందని.. ఈ ట్రెండ్‌తో అది తప్పుదారి పడుతోందని కొందరు అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఇది ప్రచారంలో భాగంగా వచ్చిన కొత్త మార్కెటింగ్ ట్రెండ్ అంటూ నిపుణులు భావిస్తున్నారు. ఏదేమైనా ఈ మైక్రో కంటెంట్ ప్రపంచంలో 'వైరల్' అవడమే అన్నింటికంటే ముఖ్యమైన విషయమని ఈ ట్రెండ్ మరోసారి రుజువు చేసింది.

# మృతి చెందిన బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే గంటా



ఓఆర్ ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్) పేరుతో వినియోగదారులను తప్పుదారి పట్టించే వారిని హెచ్చరించింది కేంద్ర ఆరోగ్య శాఖ. కొన్ని కంపెనీలు "ఓఆర్ ఎస్" గా స్వీట్ డ్రింక్స్ ను విక్రయిస్తున్నాయి. "ఓఆర్ ఎస్" అనే పదాన్ని ఉపయోగించడాన్ని ఆరోగ్య శాఖ అధికారులు నిషేధించారు. ఈ నియమాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. వ్యాపారులు నియమాలను పాటించాలని, వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని కోరారు.

ఉల్లంఘనలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. తప్పుడు సమాచారం, తప్పుదారి పట్టించే ప్రకటనల నుంచి వినియోగదారులను రక్షించడానికి ఆరోగ్య శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది.

ORS పేరుతో తీపి పానీయాలను అమ్మడం చట్టరీత్యా నేరం..

కొన్ని కంపెనీలు తమ స్వీట్ డ్రింక్స్ ను ORS (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్)పేరుతో మార్కెటింగ్ చేయడం ద్వారా వినియోగదారులను తప్పుదారి పట్టిస్తున్నాయని, వాస్తవానికి ఓఆర్ ఎస్ అనేది ఒక మెడిసినల్ సొల్యూషన్. ఇది శాస్త్రీయంగా నిర్ణయించిన నిష్పత్తి ప్రకారమే ఉప్పు, చక్కెర కలిగి ఉంటుంది. ఈ సొల్యూషన్ శరీరంలో నీరు, ఎలక్ట్రోలైట్ లోపాలను భర్తీ చేయడానికి రూపొందిస్తారు. దాని (ఫార్ములేషన్) సూత్రీకరణను ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ఆమోదించింది.

ORS అనే పదాన్ని ఉపయోగించడం పూర్తిగా నిషేధం..

ఆహారం లేదా పానీయాల ఉత్పత్తి పేరు, బ్రాండ్ లేదా లేబుల్‌లో "%ూ=ూ%" అనే పదాన్ని ఉపయోగించడాన్ని ఆరోగ్య శాఖ నిషేధించిందని అధికారులు స్పష్టం చేశారు. ఈ నియమాన్ని ఉల్లంఘించినట్లు తేలితే ఆయా కంపెనీలు లేదా విక్రేతలపై జరిమానాతోపాటు, చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. వినియోగదారులను తప్పుదారి పట్టించే ఉత్పత్తులను నిషేధించడం, మార్కెట్లో పారదర్శకతను నిర్ధారించడమే ప్రధాన లక్ష్యంగా కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది.


వ్యాపారులు అందరూ ఈ సూచనలను ఖచ్చితంగా పాటించాలని, తప్పుదారి పట్టించే లేదా తప్పుడు సమాచారంతో ఏవైనా ఉత్పత్తులను విక్రయించకూడదని అధికారులు వెల్లడిస్తున్నారు. వినియోగదారుల ఆరోగ్యం, హక్కులను కాపాడేందుకు ఏ స్థాయిలోనైనా ఉల్లంఘనలకు పాల్పడితే, ఆరోగ్య శాఖ కఠిన చర్యలు తీసుకుంటుంది. కాబట్టి వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు ఆరోగ్య శాఖ అధికారులు.

# అల్ట్రాహ్యూమన్ కొత్త రింగ్



స్మార్ట్ రింగ్ తయారీ సంస్థ అల్ట్రాహ్యూమన్ తాజాగా వేలికి ధరించే రింగ్ ప్రొ, కొత్త ప్రొ ఛార్జింగ్ కేస్‌ను పరిచయం చేసింది. ఈ రింగును ఒకసారి ఛార్జ్ చేస్తే 15 రోజుల వరకూ పనిచేస్తుంది. దీని మెమరీ సైతం గణనీయంగా పెరిగింది. డేటా 250 రోజుల పాటు అలాగే ఉంటుంది. అందువల్ల యూజర్లు ఆరోగ్య సమాచారాన్ని దాదాపు 10 నెలల వరకూ కాపాడుకోవచ్చు. బయోనిక్ గోల్డ్, స్పేస్ సిల్వర్, ఆస్టర్ బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. రీడిజైన్ చేసిన హార్ట్ రేట్ సెన్సర్లు, ఆన్ చిప్ మెషిన్ లెర్నింగ్ కోసం డ్యుయెల్ కోర్ ప్రాసెసర్‌తో మరింత అధునాతనంగా తీర్చిదిద్దారు. ఒకవేళ వేలికి గాయమై ఉబ్బితే రింగ్ తెగిపోతుంది కూడా. ప్రొ ఛార్జింగ్ కేస్‌లోనైతే ఏడాది వరకూ డేటాను స్టోర్ చేయగలదు. సుమారు 45 రోజుల పాటు బ్యాటరీని ఛార్జ్ చేస్తుంది. కేసును ఎక్కడైనా పెట్టి మరచిపోతే స్మార్ట్ ప్రాక్సిమిటీ గైడెన్స్ వ్యవస్థ సాయంతో గుర్తించొచ్చు. అల్ట్రాహ్యూమన్ ప్రపంచవ్యాప్తంగా తమ యూజర్ల కోసం ఏఐ ఆధారిత ప్రత్యక్ష బయో-ఇంటెలిజెన్స్ వేదికనూ పరిచయం చేసింది. దీని పేరు జేడ్. దీర్ఘకాల ఆరోగ్య సమాచారాన్ని దీని ద్వారా విశ్లేషించుకోవచ్చు. మున్ముందు ఎలాంటి సమస్యలు వచ్చే అవకాశముందో తెలుసు కోవచ్చు.

# ఏ దేశ టీవీ అయినా లైవ్‌లో




ప్రపంచంలో ఏ దేశంలోని లైవ్ టీవీ ప్రసారాలను ఎక్కడి నుంచైనా చూసే వీలుంటే? ఎలాంటి వీపీఎన్, అకౌంట్ కూడా అవసరం లేకపోతే? ఎంత బాగుంటుందో కదా. అయితే https.famelack.com లోకి వెళ్లి చూడండి. ఇదో ఉచిత వెబ్‌సైట్. ప్రపంచం నలుమూలల నుంచి బోలెడన్ని లైవ్ టీవీ ప్రసారాలను అందజేస్తుంది. వెబ్‌సైట్‌లోకి వెళ్లి, గ్లోబును తిప్పి దేశం మీద క్లిక్ చేస్తే చాలు. ఆ దేశంలో అందుబాటులో ఉన్న ఛానెళ్ల జాబితా కనిపిస్తుంది. నచ్చిన దానిపై క్లిక్ చేస్తే చాలు. ఆ ఛానెల్ ప్రసారం టీవీలో మాదిరిగా కనిపిస్తుంది. ఎలాంటి యాప్, సబ్‌స్క్రిప్షన్‌తో పనిలేదు




## అంతర్‌జిల్లా దొంగల అరెస్ట్




అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అంతర్‌జిల్లా దొంగలను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ రాహుల్‌మీనా తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. రామచంద్రపురం, మలికిపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇద్దరు దొంగలను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.30.36 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.
మలికిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో చోరీకి పాల్పడిన కట్టా అర్జున్ (26)ను అరెస్ట్ చేసి అతని నుంచి రూ.15.37 లక్షల విలువైన 106 గ్రాముల బంగారం, రూ.1.79 విలువైన 618 గ్రామలు వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అతడిపై 18కు పైగా చోరీ కేసులు ఉన్నాయన్నారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు మండేలా నాగ భాస్కరరావు, కర్రి రాములు పరారీలో ఉన్నారని తెలిపారు.
రామచంద్రపురంలోని రైస్‌పేటలో ఫిబ్రవరి 24న చోరీ చేసిన పాత నేరస్థుడు ఖండవల్లి సీతారాముడు(48)ను ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అరెస్ట్ చేసి రూ.13.20 లక్షల విలువైన 109.604 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అతడిపై గతంలో భీమవరం, గణపవరం పరిధిలో పలు కేసులు ఉన్నాయన్నారు. నిందితులను పట్టుకున్న డీఎస్పీలు టీఎస్ఆర్‌కే ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్, సీఐలు ఎం.వెంకట నారాయణ, టీవీ నరేష్‌కుమార్‌ను అభినందించారు. పోలీస్ సిబ్బందికి బహుమతులు అందజేశారు.

## ఆక్వా చెరువుల్లో పూడికతీత పేరిట మట్టి అక్రమ తవ్వకాలు



**రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ,:** గోదావరి రివర్ ఫ్రంట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు రూ.8 కోట్ల గ్రాంట్‌తో ప్రారంభించిన పనులు ముందుకెళ్లని పరిస్థితి. మార్చి నెల ఆఖరుకు పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 30 శాతం మాత్రమే పనులు చేపట్టారు. పనుల్లో భాగంగా గోదావరి ఘాట్ తొలగించడంతో ప్రమాదకరంగా మారింది. పనులు సకాలంలో పూర్తి చేయకపోతే వచ్చే వర్షాలకు, ఆ తర్వాత వరదలకు మూల్యం చెల్లించాల్సిందే.

**ఇదీ పరిస్థితి**

గోదావరి గట్టు ఎస్ఈ కార్యాలయం ఎదురుగా ఉన్న గట్టు నుంచి పర్యాటక కార్యాలయం వరకూ తొలి విడత రివర్ ఫ్రంటు పనులు చేపట్టారు.
గట్టు విస్తరణతోపాటు నదీ లోపల నీళ్లు తాకే విధంగా గట్టు విస్తరించడంతోపాటు బండ్ రోడ్డు ఆధునికీకరించాల్సి ఉంది. 2003 పుష్కరాలకు ఇక్కడ పార్కు నిర్మాణంలో భాగంగా గట్టును బలోపేతం చేశారు. పార్కును ఆనుకొని పద్మావతి తదితర స్నాన ఘాట్‌లు ఉన్నాయి. నూతన నిర్మాణంలో భాగంగా వాటిని తొలగించారు. ఆ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణం, నదీ లోపలకు మెట్లు నిర్మించే క్రమంలో పూర్తిగా గట్టును తవ్వేశారు.

**వర్షం వస్తే అంతే**

గోదావరి నదీ ప్రవాహానికి బాగా దిగువన ఉండటంతో ఇక్కడే నీటి వేగం ఎక్కువగా ఉంటుంది. గతంలో భారీ వరదలకు గండి పడింది. అందువల్లే అక్కడ కాంక్రీటుతో గట్టు నిర్మించారు. ప్రస్తుతం పనుల కోసం కాంక్రీటును తొలగించారు. ఇక కేవలం మట్టి గట్టు మాత్రమే మిగిలి ఉంది. ఏ మాత్రం వర్షం కురిసినా గట్టు కూరుకుపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం నదిలో నీళ్లు లేవు కాబట్టి ప్రమాదం లేకపోగా, వరదొస్తే గట్టు తెగిపోతుంది. అప్పుడు నగరం నీట మునుగుతుంది.
వాస్తవానికి గత ఏడాదే పనులు చేపట్టారు. గట్టు విస్తరణతోపాటు, బండ్ రోడ్డును పర్యాటకంగా విస్తరించాల్సి ఉంది. గత కమిషనర్ విజయ్‌రామరాజు రివర్ ఫ్రంట్ నిర్మాణ పనులకు నాంది పలికారు. మొత్తం ఘాట్ విస్తరించాలని ప్రతిపాదించారు. అయితే ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి అధికారం చేపట్టాక కేంద్రం స్పందించడంతో రూ. 8 కోట్ల గ్రాంటు మంజూరైంది. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారుడు రూ.2 కోట్ల విలువైన పనులు పూర్తి చేశారు. వాటికి సంబంధించి నిధులు మంజూరు కావాల్సి ఉంది. దీంతో పనులు ఆలస్యమవుతున్నాయి. అయితే నదీ సమతుల్యతను దృష్టిలో పెట్టుకొని పనులు ఆలస్యం చేస్తే ప్రమాదాలు ఎదుర్కోవల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై మున్సిపల్ అధికారి స్పందిస్తూ పూర్తి చేసిన పనులకు నిధులు విడుదల కావాల్సి ఉందన్నారు. పనులు ఆపడం మాత్రం జరగదని, సకాలంలో పూర్తి చేస్తామన్నారు.

## గుండెపోటుతో చనిపోయిన వ్యక్తి కోరికమేరకు

### వైద్యకళాశాలకు మృతదేహం



గోకవరం, న్యూస్‌టుడే: అర్ధరాత్రి గుండెపోటు వచ్చిన ఆయనను ఆసుపత్రికి తరలిస్తుండగా చనిపోయారు. కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో గతంలో ఆయన రికార్డు చేసిన స్వీయ వీడియో బయటపడింది. తాను చనిపోతే మృతదేహాన్ని వైద్యకళాశాలకు అప్పగించాలన్న ఆకాంక్ష అందులో వ్యక్తంచేయడంతో పుట్టెడు దుఃఖంలోనూ కుటుంబ సభ్యులు దానిని నెరవేర్చారు. వివరాలిలా ఉన్నాయి.. గోకవరానికి చెందిన రౌతు పండు (53) ఓ ఛానల్‌లో విలేకరిగా పనిచేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటు రాగా గోకవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. పుణేలో ఉన్న ఆయన కుమారుడి రాకకోసం మృతదేహాన్ని శనివారం మధ్యాహ్నం వరకు ఇంటి వద్దనే ఉంచారు. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా ఆయన చరవాణిలోని ఓ వీడియోను కుటుంబ సభ్యులు గమనించారు. జనవరి 25న తొలిసారి గుండెపోటు వచ్చిన సమయంలో ఆయన స్వీయ రికార్డు చేసిన వీడియో అది. 'నాకు గుండెపోటు వచ్చింది.. ఆసుపత్రికి వెళుతున్నాము. మృతి చెందితే నా శరీరాన్ని జీఎస్ఎల్ వైద్య కళాశాలకు ఇవ్వండి.. దహనం చేయవద్దు' అంటూ అందులో ఆయన పేర్కొన్నారు. దీంతో శనివారం సాయంత్రం మృతదేహాన్ని రాజానగరంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాలకు అప్పగించారు.

## విద్యుత్తు, గ్యాస్, నీటి వినియోగంలో ఆదా అవశ్యం

కాకినాడ: వేసవి తీవ్రత పెరుగుతున్న వేళ విద్యుత్తు, నీటి వినియోగం గణనీయంగా పెరుగుతోంది. ఇదే సమయంలో అంతర్జాతీయ ఉద్రిక్తతలు..అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో ఇంధన సరఫరాలపైనా ప్రభావం చూపుతోంది. ప్రజలు తమ అవసరాలకు తగ్గట్టుగా వినియోగిస్తూ పొదుపు పాటించడం ద్వారా సమస్య నుంచి గట్టెక్కవచ్చు. చిన్నచిన్న చిట్కాలు ఎంతో మేలుచేస్తాయి.
ఇలా చేద్దాం..:
పప్పు, బియ్యం, కూరలకు ప్రెషర్ కుక్కర్ ఉపయోగిస్తే 30 నుంచి 50 శాతం గ్యాస్ ఆదా.
పాత్రకు మూతపెట్టి వండితే వేడి బయటకు పోదు. గ్యాస్ తక్కువ ఖర్చవుతుంది.
అవసరానికి సరిపడానే మంట ఉంచాలి.
చిన్న బర్నర్‌పై పెద్ద పాత్ర వద్దు. బర్నర్ రంధ్రాలు మూసుకుపోతే మంట సరిగ్గా రాదు. తరచూ శుభ్రం చేసుకోవాలి.
ఏం వండాలో ముందే నిర్ణయించుకుంటే గ్యాస్ ఎక్కువ సేపు ఆన్ చేయాల్సిన పని ఉండదు.
టీ, పాలు వేడి చేసేటప్పుడు చిన్న బర్నర్ వాడాలి. గ్యాస్ లీకు లేకుండా చూసుకోవాలి.
విద్యుత్తు బిల్లులు తగ్గించుకుందాం..
ఏసీ ఉష్ణోగ్రతను 24-26 డిగ్రీల మధ్య ఉంచాలి. గది తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి. స్టార్ రేటెడ్ ఉపకరణాలతో విద్యుత్తు తక్కువ ఖర్చవుతుంది.
సాధారణ బల్బుల కంటే ఎల్ఈడీవి వినియోగిస్తే 70-80 శాతం విద్యుత్తు ఆదా.
సహజ గాలి, వెలుతురు కోసం కిటికీలు తెరిచి ఉంచాలి.
ఫ్రిజ్ ఎక్కువ సేపు తెరిచి ఉంచకూడదు.
సోలార్ పవర్ వాడకం పెంచితే కరెంటు భారం తగ్గుతుందని ఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్ అన్నారు.
తాగు నీటి కష్టాలు లేకుండా..
కాకినాడ జిల్లాలో భూగర్భ జలమట్టం 1.44 మీటర్ల లోతుకు పడిపోయింది. తూర్పులో 20 మీటర్ల లోతుకు వెళ్లాల్సిందే.
ఇంటి ట్యాప్‌లు, పైపుల లీకేజీలు బాగుచేయించాలి.
షవర్ కంటే బకెట్ స్నానం మేలు.
వాహనాలను పైపుతో కాకుండా బకెట్ నీటితో కడగాలి.
ఇంటి పైకప్పు నుంచి వచ్చే వాన నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాలు పెంచుకోవచ్చు.
చిన్నారులకు నీటి పొదుపు అలవాటు చేయాలని భూగర్భ జలవనరుల శాఖ ఉప సంచాలకులు రాధాకృష్ణ సూచించారు.
ఉమ్మడి జిల్లాలో కనెక్షన్లు : 22.36 లక్షలు
వేసవిలో రోజువారీ వినియోగం : 28 నుంచి 30 మిలియన్ యూనిట్లు
గుది'బండ' కాకుండా ఉండాలంటే ఉమ్మడి జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు: 20.12 లక్షలు
రోజువారీ సిలిండర్ల సరఫరా: 35 వేల నుంచి 40 వేలు

## దిండి-చించినాడ బ్రిడ్జి మరమ్మతులు



**పి.గన్నవరం, మలికిపురం** :వశిష్ఠ గోదావరినదిపై దిండి-చించినాడ మధ్య బ్రిడ్జి మరమ్మతు పనుల్లో భాగంగా కీలకమైన కొత్త బేరింగ్‌ల అమరిక ప్రక్రియ ఇటీవల మొదలైంది. ప్రత్యేకంగా తయారుచేసిన ర్యాంపు(చిన్నపాటి వంతెన)ను చించినాడ వైపు నుంచి బ్రిడ్జి 13వ కానా మధ్య ఉంచారు. శనివారం నాటికి ఈ ఖానాకు సంబంధించి 4 గడ్డర్ల కింద 4 కొత్త బేరింగ్‌ల అమరిక పనులు పూర్తయ్యాయి. శనివారం అర్ధరాత్రి దాటాక 12వ ఖానా మీదకు తీసుకువస్తారు.

**ఏం జరుగుతున్నాయంటే..**

18 మీటర్ల పొడవు 5.5. మీటర్ల వెడల్పుతో 2.30 టన్నుల బరువు గల వాహనాలు వెళ్లేలా ర్యాంపు పెట్టారు.
చించినాడ వైపు 14వ స్పేన్ (కానా) మొదలై దిండివైపున ఒకటో నంబరు కానాతో మొత్తం 14 కానాల నిడివితో ఈ బ్రిడ్జి గతంలో రూపుదిద్దుకుంది.
బ్రిడ్జి కింద పీయస్సీ గడ్డర్, బడ్‌బ్లాకుపై ఉండే పెడస్టల్ మధ్య కొత్తగా తయారుచేసిన బేరింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.
కానాకు నాలుగు గడ్డర్లు చొప్పున 14 కానాలకు సంబంధించి మొత్తం 56 బేరింగ్‌లు అమర్చుతారు. 13వ కానాకు సంబంధించి కొత్తబేరింగ్‌లు ఏర్పాటు చేస్తున్నామని జాతీయ రహదారుల విభాగం ఏఈఈ వెంకటరమణ వెల్లడించారు.
రెండురోజుల్లో పనులు పూర్తిచేసి మూడోరోజు పరిశీలిస్తారు.
ఒక్కో కానా మధ్య ఏర్పాటు చేసే నాలుగు బేరింగ్‌లు నిర్ణీత కొలతలతో అమర్చుతారు.

**వచ్చేనెల 26కు పూర్తయ్యేలా..**

వచ్చేనెల 26 నాటికి బేరింగ్ పనులు పూర్తిచేయాలని నిర్ణయించారు. ఆ విధంగా జాతీయ రహదారుల ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. కార్యాచరణ ప్రకారం పనులు పూర్తయితే మే మొదటి వారం నుంచి దీనిపై ఎప్పటిలాగే వాహనాలు అనుమతిస్తారు.

## ఒకే నూనె మళ్లీ మళ్లీ వినియోగం



**అమలాపురం:** నాణ్యతలేని ఆహార పదార్థాల విక్రయంపై కొన్నాళ్లుగా వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇందులో ప్రధానంగా నూనెలను ఎక్కువసార్లు మరిగించి వాడుతుండటం ఆరోగ్యానికి చేటు కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు, పాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు మాంసాహారం, ఇతర ఆహార పదార్థాలను వండేందుకు నూనెను భారీ మొత్తంలో వినియోగిస్తారు. ఒకే నూనెను అనేకసార్లు మరిగించడం వల్ల క్యాన్సర్ కారకాలు విపరీతంగా పెరుగుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తాజా నూనెలో టోటల్ పోలార్ కాంపౌండ్స్(టీపీసీ) 5 నుంచి 7 శాతం ఉంటాయి. మరిగించే కొద్దీ ఈ సంఖ్య పెరుగుతుంది. 25 శాతానికి మించితే ఆరోగ్యానికి హానికరం. ఇది పెరిగే కొద్దీ హానికారక రసాయనాలు పెరుగుతాయి.
జిల్లాలో అధికారికంగా 250 వరకు హోటళ్లు, వెయ్యికి పైగా పాస్ట్‌ఫుడ్ దుకాణాలు నడుస్తున్నాయి. వీటిలో వంట నూనె చిక్కగా మారేవరకు ఎక్కువసార్లు వినియోగిస్తున్నారు. ఇటీవల ఆహార భద్రత, పురపాలక అధికారులు హోటళ్లపై దాడులు నిర్వహించి ఇలాంటి నూనెను స్వాధీనం చేసుకున్నారు.

**యుద్ధం నేపథ్యంలో..**

ముడి సరకుల దిగుమతులు ఆగిపోవడంతో స్థానిక మార్కెట్లో నూనెల ధరలు పెరిగాయి. కిలో ప్యాకెట్‌పై రూ.10 చొప్పున పెంచాయి. లూజు విక్రయ వ్యాపారులు లీటరుకు రూ.15 నుంచి రూ.30 వరకు పెంచారు. దీంతో హోటళ్లు, పాస్ట్‌ఫుడ్ దుకాణదారులు ఎక్కువసార్లు వినియోగిస్తున్నారు.

**పాతనూనె కొనుగోలు..**

నూనె ఎక్కువసార్లు వినియోగించకుండా నివారించేందుకు చెన్నైకు చెందిన స్టార్ గ్లోబల్ సంస్థతో హోటళ్ల యజమానులకు అవగాహన కల్పించారు. వారు మూడు నుంచి నాలుగు సార్లు వినియోగించిన నూనెను లీటరు రూ.40 ఇచ్చి కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చారు. దీని బయోడీజిల్ తయారీలో వినియోగిస్తామని వారు తెలిపారు.

**25 కాదు.. 48 శాతం**

అమలాపురం గడియారస్తంభం కూడలికి సమీపంలోని రెస్టారెంట్‌లో కుళ్లిన మాంసాహారం పెట్టారని అందిన ఫిర్యాదు నేపథ్యంలో పురపాలక అధికారులు తనిఖీలు చేయగా మడ్డిలా మారిన వంట నూనెను స్వాధీనం చేసుకున్నారు.
అమలాపురంలోని ఇటీవల ఓ హోటల్‌లో తనిఖీలు చేసి పరిమితికి మించినసార్లు వాడిన వంట నూనె స్వాధీనం చేసుకున్నారు. దాని టీపీసీ 48 ఉండటం గమనార్హం.
రాజోలు నియోజకవర్గం పరిధిలోని ఓ నాన్‌వెజ్ దుకాణంలో నూనెను పరిశీలించగా టీపీసీ 42 శాతంగా నమోదైంది.

**డబ్బాలు పంపిణీ**

**-రామయ్య, ఆహార భద్రతాధికారి**

వినియోగించిన వంట నూనెను సేకరించేందుకు హోటళ్లకు డబ్బాలు పంపిణీ చేస్తున్నాం. ఈ అవకాశాన్ని నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలి. ఎక్కడైనా మడ్డిలా మారిన నూనె వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే వారి అనుమతులు రద్దు చేయడంతోపాటు చర్యలు తీసుకుంటాం.

## పదో తరగతి పరీక్షలపై డీఈవో నాగేశ్వరరావు



**ముమ్మిడివరం,:** పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) పి.నాగేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావుతో కలిసి శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న పరీక్షల ఏర్పాట్ల గురించి వివరించారు. ఆ వివరాలివీ..

**108 కేంద్రాలు..**

జిల్లాలో 108 కేంద్రాల్లో 19,310 మంది పరీక్షలు రాయనున్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 12,668 మంది, ప్రైవేటు విద్యాలయాల నుంచి 6,642 మంది ఉన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష సమయం. కారణం ఉంటే అరగంట ఆలస్యమైనా అనుమతిస్తారు. ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాలి.

**పూర్తి స్థాయిలో సన్నద్ధం**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేశారు. ఎస్ఈఆర్టీ వంద రోజుల ప్రణాళికను రాష్ట్రంలో డిసెంబరు నుంచి అమలు చేస్తే.. జిల్లాలో అక్టోబరు నుంచే ఈ ప్రణాళికను అమలు చేశారు. మానసిక వైద్యులతో అవగాహన కల్పించారు.

**35 చోట్ల సిట్టింగ్ స్క్వాడ్**

25 పోలీస్‌స్టేషన్లలో పరీక్ష పేపర్ల స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. 35 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించారు. రెవెన్యూ, పోలీస్, విద్యాశాఖ నుంచి 5 ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా ఎంపిక చేశారు.

**సాధారణ దుస్తుల్లోనే వెళ్లాలి..**

జిల్లాలో 234 మంది దివ్యాంగ విద్యార్థులకు సహాయకులు (స్క్రైబ్) పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఎవరైనా సంబంధిత యూనిఫాం ధరించకూడదు.

**సదుపాయాల కల్పన**

గదుల్లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, తాగునీరు, బెంచీలు వంటివి ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలో వైద్యసిబ్బంది ఉంటారు. 144 సెక్షన్ అమలులో ఉంటుంది. చుట్టుపక్కల జిరాక్స్ దుకాణాలు మూసివేస్తారు. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు.
8కేంద్రాల్లో సీసీ కెమెరాలు
అవసరమైనచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కందికుప్ప, బండారులంక జడ్పీ ఉన్నత పాఠశాలలు, మలికిపురం ఏఎఫ్‌డీడీ హైస్కూల్, ఊబలంక, నరేంద్రపురం, సిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలు, మండపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రామచంద్రపురంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో వీటిని ఏర్పాటు చేశారు.

## గోదావరిలో గల్లంతైన యువకుడు మృతి



**ముమ్మిడివరం:** గోదావరిలో మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం ఐనాపురంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఐనాపురం గ్రామానికి చెందిన భానుప్రసాద్(24)అనే యువకుడు. బంధువైన ఓ వ్యక్తి అంత్యక్రియలకు వెళ్లాడు. కార్యక్రమం ముగించుకుని గోదావరిలో స్నానం స్నానం చేసేందుకు దిగి గల్లంతయ్యాడు. స్థానిక మత్స్యకారుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టగా.. యువకుడి మృతదేహం లభ్యమైంది.

## శంకవరంలో పులి సంచారం..

### వాహనాల దారి మళ్లింపు



**ప్రత్తిపాడు, శంఖవరం :** పెద్ద పులి స్వైర విహారం చేస్తూ ప్రత్తిపాడు, శంఖవరం మండలాల ఉపప్రణాళిక మన్యంలో యంత్రాంగాన్ని శుక్రవారం ఉరుకులు పరుగులు పెట్టించింది. డీఎఫ్‌వో ఎన్.రామచంద్రరావు నేతృత్వంలో ఎన్ఎస్‌టీఆర్, వెటర్నరీ, రెస్క్యూ బృందాలు పులి జాడను గమనిస్తూ బంధించే ఏర్పాట్లు చేశారు. తాడువాయి వద్ద పశువును వేటాడాక మాసంపల్లి, రాజారం మధ్య రోజంతా మాటు వేయడంతో దానిని ఎరవేసి బంధించేందుకు ఏర్పాట్లు చేసినా ఫలితం దక్కకుండా పోయింది. దిశమార్చుకుని రాజారం, గొంది, జి.కొత్తపల్లి మీదుగా అచ్చంపేట అటవీ ప్రాంతానికి చేరుకుంది.. ఈ క్రమంలో బవురువాక కొత్తపల్లి పలుచోట్ల అధికారులు, గ్రామస్థులకు కనిపించింది. వీఆర్‌వో దొంగబాబు, మాసంపల్లి గ్రామస్థులు సమీప దూరంలో వెళ్లడం చూశామని చెప్పారు. పొదురుపాకకు చెందిన స్కూలు బస్సు డ్రైవరు అర్జున్ జి.కొత్తపల్లి మీదుగా వస్తుండగా బొమ్మ వద్ద మలుపులో పులి రహదారిని దాటుతూ కనిపించిందన్నారు. పులిని బంధించే ఏర్పాట్లలో ఉన్నామని ఆపరేషన్‌కు సారథ్యం వహిస్తున్న డీఎఫ్‌వో రామచంద్రరావు తెలిపారు.

## కూటమి ప్రభుత్వ పాలనలో

### శరవేగంగా సాగుతోన్న పనులు



గండేపల్లి: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతి గ్రామంలో డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు కందుల చిట్టిబాబు అన్నారు. గండేపల్లి మండలం జడ్.రాగంపేట గ్రామంలో డ్రెయిన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఏళ్లుగా పరిష్కారమవ్వని పనులు జరుగుతుంటే గ్రామాల్లో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఓ వైపు గ్రామాల అభివృద్ధి, మరో వైపు పథకాల అమలుతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

## వైద్యులు సేవాభావంతో పనిచేయాలి:

### మంత్రి కందుల దుర్గేశ్



**నిడదవోలు:** వైద్యులు సేవాభావంతో పనిచేయాలని మంత్రి కందుల దుర్గేశ్ సూచించారు. శనివారం నిడదవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్యుల పనితీరు, మందుల నిల్వలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైద్య వృత్తి మానవతా సేవతో సమానమని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు.




## 17న ఏయూలో శతాబ్ది కళా ఉత్సవ్

**-సంగీత, నృత్య విభాగాల ఆధ్వర్యంలో నిర్వహణ**

**(విశాఖ సమాచారం ,ఆంధ్రవిశ్వవిద్యాలయం:** ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 17వ తేదీ(మంగళవారం) సాయంత్రం 4 గంటల నుంచి బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా సంగీత, నృత్య విభాగం ఆధ్వర్యంలో శతాబ్ది కళా ఉత్సవం నిర్వహిస్తున్నట్లు సంగీత విభాగాధిపతి ఆచార్య సరస్వతి విద్యార్థి తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం. ఎన్ హరేంధిర ప్రసాద్ ముఖ్య అతిధిగా హాజరవుతున్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిధిగా శతాధిక వృద్ధులు, ప్రముఖ వయోలిన్ విద్వాంసులు, సద్గురువులు పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామి హాజరవుతున్నారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ మార్గదర్శకంలో నిర్వహిస్తున్న ఈ శతాబ్ది కళా ఉత్సవంలో భాగంగా పలువురు ప్రముఖ సంగీత, నృత్య కళాకారులను గురు సత్కారంతో సత్కరిస్తారు. బీచ్ రోడ్డులోని ఏయు కన్వెన్షన్ సెంటర్ వేదికగా సుమారు నాలుగు గంటల పాటు సంగీత నృత్య విభాగం విద్యార్థులు భక్తి సంగీతం, ప్రముఖ సంగీత వాగ్గేయకారులైన ముత్తుస్వామి దీక్షితులు వారి నొట్టు స్వరాలు, జానపద గేయాలు మొదలగునవి ఆలపిస్తారు. నృత్య విభాగంలో కూచిపూడి సాంప్రదాయ నృత్యాలు, కథక్ నృత్యం, ఉత్తరాంధ్ర ప్రసిద్ధమైన థింసా నృత్యం, దశావతార నృత్యం, జానపద నృత్యం, శ్రీనివాస కళ్యాణం మొదలైన అంశాలను ప్రదర్శిస్తారు. అన్నమయ్య వంటి వాగ్గేయకారుల గీతాలను వేదికపై విద్యార్థులు ఆలపిస్తారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## గ్యాస్ కొరత..హీరోల ఫన్నీ మీమ్స్ అదుర్స్!

ప్రస్తుతం దేశవ్యాప్తంగా వంటగ్యాస్ సిలిండర్ల కోసం సామాన్యులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల దిగుమతులు తగ్గడంతో, సిలిండర్ బుక్ చేసినా రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. అయితే, ఈ కష్టాలను కూడా మన నెటిజన్లు తమదైన శైలిలో హాస్యంగా మలుస్తున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న క్రేజీ సినిమా మీమ్స్ చూస్తుంటే, నవ్వు ఆపుకోవడం ఎవరి తరమూ కావడం లేదు. సినిమా పోస్టర్లను గ్యాస్ సిలిండర్లకు ముడిపెడుతూ వస్తున్న ఈ ఫన్నీ మీమ్స్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి.




## ప్రభుదేవా మాస్టర్ కాపీని పరిచయం చేస్తున్న శేఖర్ మాస్టర్




భారతీయ చలనచిత్ర పరిశ్రమలో –ఇండియన్ మైఖేల్ జాక్సన్–గా నీరాజనాలు అందుకున్న ప్రభుదేవా నటవారసుడు వెండితెరకు పరిచయం కాబోతున్నాడు. ప్రభుదేవా కుమారుడు –రిషిల్ రాఘవేంద్ర దేవా– హీరోగా తెరంగేట్రం చేస్తుండటం ఇప్పుడు ఫిలిం నగర్ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. చూడటానికి అచ్చం తండ్రి ప్రభుదేవాలానే ఉన్న రిషిల్.. మాస్ లుక్‌లో కనిపిస్తూ అభిమానుల్లో అంచనాలు పెంచుతున్నాడు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఈ నటవారసుడిని వెండితెరకు పరిచయం చేసే బాధ్యతను టాలీవుడ్ స్టార్ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ తీసుకున్నారు. ఇప్పటివరకు ఎందరో హీరోలకు తన స్టెప్పులతో క్రేజ్ తెచ్చిన శేఖర్ మాస్టర్ ఇప్పుడు మెగాఫోన్ పట్టి దర్శకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఒక స్టార్ కొరియోగ్రాఫర్ కొడుకును.. మరో స్టార్ కొరియోగ్రాఫర్ దర్శకత్వ డెబ్యూలో పరిచయం చేస్తుండటం విశేషం.

టాలీవుడ్ చరిత్రను గమనిస్తే.. కొరియోగ్రాఫర్లు దర్శకులుగా మారి పెద్ద విజయాలు సాధించిన దాఖలాలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుదేవా స్వయంగా దర్శకుడిగా మారి బ్లాక్ బస్టర్లు అందుకున్నారు. ఆ తర్వాత లారెన్స్ మాస్టర్ దర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్ సంపాదించుకున్నారు. ఇప్పుడు శేఖర్ మాస్టర్ కూడా అదే బాటలో పయనిస్తూ తన కెరీర్‌ను మలుపు తిప్పుకునే భారీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కిస్తున్నారు. ఈ సినిమా కథాంశం ప్రధానంగా –మ్యూజిక్ మరియు డాన్స్– నేపథ్యంతో ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ప్రభుదేవా తనయుడు కావడం.. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో రాటుదేలిన వారు కావడంతో.. ఈ చిత్రంలో డాన్స్ పెర్ఫార్మెన్స్ పీక్స్ లో ఉంటాయని అభిమానులు ఆశిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే.. తండ్రికి తగ్గ తనయుడిగా రిషిల్ రాఘవేంద్ర తన డాన్స్ ప్రతిభను నిరూపించుకోవడానికి ఇది సరైన వేదిక కానుంది. ప్రస్తుత సమాచారం ప్రకారం.. ఈ సినిమా షూటింగ్ మే లో ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రీ–ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని త్వరలోనే చిత్ర యూనిట్ అధికారికంగా సినిమా వివరాలను ప్రకటించనుందని సమాచారం. ప్రభుదేవా మాస్టర్ కాపీలా ఉన్న తనయుడిని ఊరమాస్ అవతార్‌లో చూడటానికి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. శేఖర్ మాస్టర్ దర్శకత్వ ప్రతిభ, రిషిల్ రాఘవేంద్ర స్క్రీన్ ప్రెజెన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా మారతాయని అంచనా వేస్తున్నారు. కొరియోగ్రఫీ నుంచి డైరెక్షన్ వైపు అడుగు వేస్తున్న శేఖర్ మాస్టర్‌కు ఈ ప్రాజెక్ట్ ఒక అగ్నిపరీక్ష లాంటిదే అయినా ప్రభుదేవా వారసుడిని నిలబెట్టడంలో ఆయన విజయం సాధిస్తారని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## ఎప్పుడూ అదే ధ్యాస.. ఏం క్లారిటీ గురూ!



మెగా ఫ్యామిలీ హీరో అల్లు శిరీష్ తాజాగా తన ప్రియురాలు నయనిక రెడ్డిని వివాహం చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తన ప్రేమ ప్రయాణం గురించి శిరీష్ పంచుకున్న కొన్ని విషయాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా భవిష్యత్తులో తమకు పుట్టబోయే పిల్లలను ఎలా పెంచాలి అనే విషయంలో ఆయనకు ఉన్న స్పష్టత చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. కేవలం సినిమాలే కాకుండా, సంప్రదాయాలు మరియు భాష పట్ల ఆయనకున్న గౌరవం ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ వివరాలు చూద్దాం.. అల్లు శిరీష్ తన భార్య నయనిక గురించి మాట్లాడుతూ.. ఆమెలోని ముక్కుసూటితనం మరియు సెన్స్ ఆఫ్ హ్యూమర్ తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. అయితే వీరు ప్రేమలో ఉన్నప్పుడే ఒక ముఖ్యమైన విషయం గురించి చర్చించుకున్నారట. "మాకు పుట్టబోయే పిల్లలు ఇంట్లో కచ్చితంగా తెలుగులోనే మాట్లాడాలి" అని శిరీష్ తన మనసులోని మాటను నయనికకు ముందే చెప్పేశారట. నేటి కాలంలో సెలబ్రిటీల పిల్లలు ఎక్కువగా ఆంగ్ల భాషకే ప్రాధాన్యత ఇస్తుంటే, శిరీష్ మాత్రం మాతృభాషపై ఇంతటి స్పష్టతతో ఉండటం నిజంగా గర్వించదగ్గ విషయం. గతంలో ఇలానే జూనియర్ ఎన్టీఆర్, అలాగే అల్లు అర్జున్ వంటి స్టార్లు కూడా తమ పిల్లలకు తెలుగు భాషను నేర్పించడంపై ఆసక్తిని కనబరిచిన సందర్భాలు ఉన్నాయి. శిరీష్ తన లవ్ స్టోరీ ఇంట్లో ఎలా తెలిసిందో చాలా సరదాగా వివరించారు. వీరు డేటింగ్‌లో ఉన్నప్పుడు ఒకసారి కాఫీ షాప్‌కు వెళ్లగా, అక్కడ వీళ్ళను చూసిన వారు వెంటనే చిరంజీవి భార్య సురేఖకి ఫోన్ చేసి చెప్పేశారట. అలా అత్తయ్య ద్వారా ఇంట్లో విషయం తెలిసిపోవడంతో శిరీష్ కూడా ఆలస్యం చేయకుండా నయనికపై ఉన్న ప్రేమను బయటపెట్టారు. మెగా మరియు అల్లు కుటుంబ సభ్యులు వెంటనే అంగీకరించడంతో వీరి పెళ్లి అట్టహాసంగా జరిగింది. నయనికను వాళ్ల నాన్న ఎంత ప్రేమగా చూసుకున్నారో, తాను కూడా అంతకంటే గొప్పగా చూసుకుంటానని శిరీష్ తన బాధ్యతను చాటుకున్నారు.

## గంజాయి అక్రమ రవాణాదారులపై అనకాపల్లి జిల్లా పోలీసుల ఉక్కుపాదం

**ఇద్దరు నిందితులపై 'పిట్ ఎన్.డి.పి.ఎస్'చట్టం ప్రయోగం**




**అనకాపల్లి/చీడికాడ (విశాఖ సమాచారం బ్యూరో):-** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, జిల్లాలో గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా,వరుస నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులపై పిట్ ఎన్ డి పి ఎస్ యాక్ట్ (ప్రివెన్షన్ ఆఫ్ ల్లిసిట్ ఆఫ్ ట్రాఫిక్ ఇన్ నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్ స్టాన్సెస్ యాక్ట్) కింద ఉత్తర్వులు జారీ చేసి, వారిని రిమాండ్‌కు తరలించారు.ఈ సందర్భంగా నిందితుల వివరాలు మరియు నేపథ్యం గురించి ఈ విధంగా తెలియచేశారు.విస్సరపు లింగేశ్వరరావు (23) బైలపూడి గ్రామం, చీడికాడ మండలం. ఇతనిపై గతంలో కశింకోట, నర్సీపట్నం పట్టణ మరియు చీడికాడ పోలీస్ స్టేషన్లలో మూడు వేర్వేరు గంజాయి కేసులు నమోదై ఉన్నాయి.నిత్యం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఇతనిపై ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వుల (జి.ఓ.ఆర్ టి.నం.20) మేరకు చర్యలు తీసుకున్నారు.గుమ్మిడి నిరంజన్ తండ్రి నాయుడు వయసు 27 సం, బైలపూడి గ్రామం, చీడికాడ మండలం. ఇతనిపై చీడికాడ, యెర్పేడు (తిరుపతి జిల్లా), మరియు సీతానగరం (తూర్పుగోదావరి జిల్లా) పోలీస్ స్టేషన్లలో పలు గంజాయి కేసులు ఉన్నాయి. ఇతనిపై కూడా ప్రభుత్వ ఉత్తర్వుల (జి.ఓ.ఆర్ టి.నం.1621) ప్రకారం పిట్ ఎన్.డి.పి.ఎస్ చట్టాన్ని అమలు చేశారు.ఈ సందర్భంగా వీరిని విశాఖ సెంట్రల్ జైలుకు తరలింపు చేశారు.కె.కోటపాడు ఇన్స్పెక్టర్ కె.కృష్ణ మరియు చీడికాడ ఎస్సై సతీష్ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ నిర్వహించబడింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి, పటిష్ట భద్రత నడుమ విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించారు.ఈ సందర్భంగా పోలీసుల హెచ్చరిక జారీ చేశారు.జిల్లాలో గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా లేదా విక్రయించినా సహించేది లేదని ఎస్పీ గారు హెచ్చరించారు. అలవాటు పడిన నేరస్తులపై కేవలం సాధారణ సెక్షన్లే కాకుండా, ఇలాంటి కఠినమైన చట్టాలను ప్రయోగిస్తామని, వారి ఆస్తుల జప్తుకు కూడా వెనకాడబోమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## అమర జీవి పొట్టి శ్రీరాములు 125 వ జయంతి



**ఏయూ క్యాంపస్, (విశాఖ సమాచారం):** ఆంధ్ర యూనివర్సిటీ శత జయంతి ఉత్సవాల సందర్భంగా తెలుగు శాఖ, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ శాఖ మరియు సమైక్య భారతి ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125 వ శత జయంతి ఉత్సవము అత్యంత ఘనంగా ఆంధ్ర యూనివర్సిటీ అసెంబ్లీ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగు శాఖ అధిపతి ప్రొఫెసర్ జర్ర అప్పారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉప కులపతి ప్రొఫెసర్ వి. బాల మోహన్ దాస్ , విక్రమ సింహ పురి పూర్వ ఉప కులపతి ప్రొఫెసర్ ఆర్. సుదర్శన రావులు ఆంధ్ర సాధనలో పొట్టి శ్రీరాములు చేసిన కృషిని, త్యాగాన్ని వివరించారు. విశిష్ట అతిథులుగా ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్.ఏ. నరసింహారావు , గురజాడ అప్పారావు ముని మనవడు డాక్టర్ ఎం. విజయ గోపాల్, జువాలజీ శాఖాధిపత ప్రొఫెసర్ సి.మంజులత, రాజనీతి శాస్త్ర శాఖాధ్యక్షుడు ప్రొఫెసర్ పేటేటి ప్రేమానందం, సమైక్య భారతి జాతీయ సమన్వయ కర్త పి.కన్నయ్య, లు సభను ఉద్దేశించి మాట్లాడారు. చివరిగా డా.ముసుగు ప్రసాద్, ప్రొ. పేటేటి ప్రేమానందం ఆలపించిన గేయాలు అందరినీ అలరించాయి.

## రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించిన మంత్రి సంధ్యారాణి



**సాలూరు విశాఖ సమాచారం :** రైతన్న మీకోసం కార్యక్రమాన్ని గిరిజన శాఖ మంత్రి జీ సంధ్యారాణి సాలూరు మండలం, మామిడిపల్లి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా మంత్రి గ్రామ సభ నిర్వహించి రైతులు ప్రజలు కష్టనష్టాలు తెలుసుకొని సమస్యను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు బాంధవుడని రైతులు సంక్షేమానికి కృషి చేస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చేనా సూపర్ సిక్స్ హామీలు నెరవేరుస్తున్నారని గర్వముగా చెప్పారు మహిళలకు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం ఇచ్చిన హామీను నిలబెట్టుకుని రైతులు బ్యాంకు ఖాతాలకు 4 వేల రూపాయలు జమ చేయడం జరిగిందని అన్నారు ఈ నిధులు రైతులు వ్యవసాయ మదుపులకు వినియోగించుకోవాలని కోరారు. సాలూరు నియోజకవర్గం పరిధిలో రిజర్వాయర్లు ద్వారా సాగునీరు అందిస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సాలూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేశ్వరరావు స్థానిక నాయకులు బి తవుడు మహిళా మండలి టిడిపి అధ్యక్షురాలు డొంక పద్మావతి సాలూరు మండల టిడిపి నాయకులు అప్పికొండ యుగంధర్ సాలూరు మండల టిడిపి నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మంత్రి సంధ్యారాణి మామిడిపల్లి గ్రామ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు.

## ఐ వి ఆర్ ఎస్ ఫోన్ కాల్స్ గురించి అవగాహన సదస్సు



**అనంతగిరి విశాఖ సమాచారం న్యూస్. :** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. ఎగువ శోభ పంచాయతీ. మర్దగుడ గ్రామంలో సోమవారం నాడు అనంతగిరి మండల్ తాసిల్దార్ వారి ఆధ్వర్యంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పరిపాలన విధానం ప్రజలకు జరుగుతున్న న్యాయ పరిపాలన విధానం తెలియజెప్పుటకు మర్దగుడ. దండబాడు. హెక్టగుడ. కమలాపురం.జాంగుడ. భీసు పురం. కొత్తవలస. గ్రామాల ప్రజలకు ఐ వి ఆర్ ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా ప్రభుత్వనికి గ్రామంలో ప్రజలకు పరిపాలన విధానం ప్రభుత్వం ద్వారా జరుగుతున్న పలు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఫోన్ కాల్స్ ద్వారా నేరుగా ప్రజల నుండి తెలుసుకోవడమే ఈ ఐ వి ఆర్ ఎస్ ఫోన్ కాల్ అడిగిన సమాధానా నికి అవునంటే ఒకటో నెంబర్ నొక్కండి లేదంటే రెండో నెంబర్ నొక్కండి అని తాసిల్దార్ వారు ప్రజలకు సూచించారు ఈ సమాచారం మీ నుండి నేరుగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారికి వెళ్తుందని అన్నారు ప్రతి ఒక్కరూ మీకు జరుగుతున్న న్యాయ పరిపాలన విధానం గురించి ప్రభుత్వానికి తెలియపరచడమే ఈ ఐ వి ఆర్ ఎస్ ఫోన్ కాల్స్ అని అయినా తెలియపరిచారు ఈ కార్యక్రమంలో కె వీరభద్ర చారి అనంతగిరి మండల తాసిల్దార్. గణేష్ మండల సర్వేయర్. మండల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ జగ్గయ్యమ్మ. వీఆర్వో రాజేశ్వరి. కె సింహాద్రి పంచాయతీ సర్పంచ్. పంచాయతీ పెద్దలు గ్రామస్తులు గ్రామ పెద్దలు తదితర రైతులు పాల్గొన్నారు

## గురువులను గౌరవించాలి: హరగోపాల్



**ఏయూ క్యాంపస్, (విశాఖ సమాచారం):** ఆంధ్ర యూనివర్సిటీలో రిజిస్ట్రార్ ఆఫీస్ వద్ద టెంపరరీ టీచింగ్ అరేంజ్మెంట్ నిర్వహిస్తున్న నిరాహార దీక్ష ఈ రోజుకి 31 వ రోజుకి చేరుకుంది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ కు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్ మద్దతు పలికారు. సమాజంలోని గురువులకు సముచిత స్థానం ఉన్నదని దాన్ని కాపాడుకోవలసిన బాధ్యత అందరి మీద ఉందని హరిగోపాల్ దీక్షా శిబిరంను ఉద్దేశించి మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో చదువుకునే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించవలసిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉన్నదని తక్షణమే శాశ్వత ప్రాతిపదికన పోస్టులు భర్తీ చేపట్టాలని కోరారు . ప్రభుత్వాలు విద్యను ప్రైవేటు రంగంలో ప్రోత్సహిస్తుందని ప్రభుత్వ రంగంలో విద్యను పేదలకు దూరం చేస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్పొరేటు సంస్థలు విద్యను వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలు యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని హరించే విధంగా వర్సిటీ వీసీలు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వైస్ ఛాన్సలర్లు శత జయంతి ఉత్సవాల్లో మునిగితేలుతున్నారని సమస్యలు పట్టించుకోవట్లేదు అని అతిథి అధ్యాపకులు అధ్యక్షుడు సురేష్ మీనన్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు డా. ముసుగు ప్రసాద్ సిహెచ్ ప్రసాద్ , శేషు , విక్రం దాస్, త్రినాధ్, శిరీష్ మహేష్, కోమలి, కళ్యాణి రాయి, పీవీరామ్ , అభిషేక్ తమ్మురా క్షేత్ర పాల్, గిరీష్, దుర్గా ప్రసాద్ , దివ్య , పవన్, మురళి, రాయ్ తదితరులు పాల్గొన్నారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com